మంత్రి భరత్‌ను కలిసిన కర్నూలు జిల్లా కలెక్టర్



రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి టీజీ భరత్‌ను కర్నూలు జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. సంకల్‌బాగ్‌లోని మంత్రి నివాసానికి కలెక్టర్ వెళ్లి పుష్పగుచ్ఛం అందజేశారు.

- కర్నూలు కలెక్టరేట్



నల్లమల అటవిలో వదలిన చిరుతపులి (ఫైల్)

నంద్యాల ఫారెస్టు రేంజ్‌లోని మూడు వాగుల గడ్డ బేస్ క్యాంపు

చిరుత భయం

- నల్లమలలో వరుసగా చిరుత పులుల దాడి
- ఒకరి మృతి, నలుగురికి గాయాలు
- గాయపడిన వారిలో బేస్ క్యాంపులో పని చేస్తున్న ప్రొటెక్షన్ వాచర్ కూడా..
- ఇది.. తిరుమలలో చిన్నారిపై దాడి చేసిన చిరుతేనా?
- ఇంకో రెండు చిరుతలు ఉన్నాయా?

రుద్రవరం, జూన్ 28 :

నల్లమల సమీప గ్రామాలను ఉక్కిరిబిక్కిరి చేసిన చిరుత ఎట్టకేలకు బందీ అయింది. అయితే ఈ చిరుత దాడిలో నలుగురు గాయపడ్డారు. ఓ మహిళ మృతి చెందింది. ఈ నేపథ్యంలో అధికారులు చేసిన ప్రయత్నం ఫలించి చిరుత బోనులో పడింది. గత ఏడాది తిరుమలలో ఓ చిన్నారిపై దాడి చేసిన చిరుత ఇదేనా? అనే చర్చ సాగుతోంది. కాగా మరో రెండు చిరుతలు సంచరిస్తున్నాయని అటవీ గ్రామాల ప్రజలు అంటున్నారు. ఫారెస్టు అధికారులు కూడా అదే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. వెరసి ఈ గ్రామాలకు చిరుత భయం తీరేలా లేదు.



గతంలో బోనులో చిక్కిన చిరుత పులి

ఫిబ్రవరి 25 రాత్రి చిరుతపులి ప్రొటెక్షన్ వాచర్‌పై దాడి చేసి గాయపరిచింది. ఏప్రిల్ 3వ తేదీ రాత్రి నంద్యాల - ఒంగోలు ఫారెస్టు చెక్‌పోస్టులో పనిచేస్తున్న దస్తగిరి చిరుత దాడిలో గాయపడ్డాడు. జూన్ 25వ తేదీన పచ్చర్ల గ్రామానికి చెందిన బషీరున్నీసాబీ చిరుత దాడిలో మృతి చెందింది. అదే గ్రామానికి చెందిన మరో మహిళపై చిరుత దాడి చేయగా.. ఆమె కేకలు వేయడంతో చిరుత అడవిలోకి పారిపోయింది. జూన్ 13న ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన పాండవ్ అనే మహిళా రైలు కూలీపై చిరుత దాడి చేసింది. నంద్యాల జిల్లా ఫారెస్టు పరిధిలోని నంద్యాల రేంజ్‌లో ఒకసారి, చెలిమ రేంజ్‌లో పలుసార్లు చిరుత పులులు దాడులు చేశాయి. నల్లమల అడవులు వన్యప్రాణులకు కేరాఫ్. నంద్యాల జిల్లా నంద్యాల ఫారెస్టు రేంజ్‌లోని మూడు వాగుల గడ్డ బేస్ క్యాంపు (శీతల్ బేస్ క్యాంపు) ప్రొటెక్షన్ వాచర్‌లపై చిరుతపులులు దాడి చేయడాన్ని ఫారెస్టు అధికారులు తొలిసారి అని చెబుతున్నారు. తిరుమల కాలినడకన వెళ్లే మార్గంలో 2023 సెప్టెంబరులో చిరుతపులి చిన్నారిపై దాడి చేసిన విషయం విదితమే.

తిరుమలలో చిన్నారిపై దాడి చేసిన చిరుత ఇదేనా?

నంద్యాల ఫారెస్టు రేంజ్‌లోని మూడువాగుల గడ్డ బేస్‌క్యాంపు ప్రొటెక్షన్ వాచర్ అజీమ్‌బాషాపై దాడి చేసిన చిరుతపులి 2023 తిరుమల కాలినడకన వెళ్లే మార్గంలో చిన్నారిపై దాడి చేసిన చిరుతపులి ఒకటే అనే ప్రచారం నడుస్తోంది. మనిషి రక్తానికి అలవాటుపడిన చిరుతను ఇక్కడ వదిలేసినట్లు అనుమానిస్తున్నారు.

డివిజన్ సరిహద్దుల్లో ఒకటి, చెలిమ రేంజ్‌లో మరో చిరుతను వదిలారా..;?

తిరుమల శేషాచలం అడవుల్లో 2023 సెప్టెంబరులో కాలినడకన వెళ్లే భక్తులపై చిరుతపులి దాడి చేసిన విషయం విదితమే. ఆ చిరుతలను అక్కడ బోనులో బంధించి ప్రకాశం జిల్లా గిద్దలూరు డివిజన్ నంద్యాల జిల్లా డివిజన్ పరిధిలోకి ఇసుకగుండాల ప్రాంతంలో ఒక చిరుతపులిని, చెలిమ రేంజ్ ప్రదేశంలో మరో చిరుతను 2023 సెప్టెంబరులో బోనులలో తీసుకువచ్చి ఫారెస్టు అధికారులు వదిలారని చర్చ కొనసాగుతోంది. తిరుమల అక్కడ దాడి చేసిన చిరుత మూడువాగుల గడ్డాలో ప్రొటెక్షన్ వాచర్‌పై దాడి చేసిన చిరుత ఒక్కటేనని ప్రచారంలో ఉంది. తిరుపతి నుంచి ఇక్కడికి తరలిస్తున్న సమయంలో చిరుతకు బోనుకు ఉన్న కడ్డీని కొరకడంతో దాని పన్ను విరిగినట్లు సమాచారం.



చిరుతపులి దాడిలో గాయపడిన దస్తగిరి (ఫైల్)



మృతి చెందిన బషీరున్నీసాబీ (ఫైల్)

తిరుమలలో డీఎన్ఏ శాంపిల్ సేకరణలో తప్పిదం జరిగిందా..!?

తిరుపతి సమీపంలో చిన్నారిపై దాడి చేసిన చిరుతపులి డీఎన్ఏ శాంపిల్ తీయడంలో తప్పిదం జరిగిందా.. అన్న చర్చ కొనసాగుతోంది. చిరుతపులి పెంటను సేకరించి డీఎన్ఏ చేస్తారు. వాటి సేకరణలో తప్పిదం జరిగిందేమోనని అనుమానాలు వ్యకమవుతున్నాయి. చిరుతపులి మనిషిని తిని ఉంటే డీఎన్ఏలో తేలుతుంది.

చిరుత, పెద్దపులుల సంచారం రాత్రి ఎక్కువ

అడవిలో చిరుతపులులు, పెద్దపులుల సంచారం రాత్రిపూట ఎక్కువగా ఉంటుంది. అయితే మనిషి నిలబడితే చిరుత కానీ, పెద్దపులి కానీ దాడి చేసే అవకాశం లేదని ఫారెస్టు అధికారులు చెబుతున్నారు. అడవిలోకి ఫారెస్టు అధికారులు ఒకరిద్దరు వెళ్లకుండా ఐదారుగురు కలిసి వెళ్లాలని ఉన్నతాధికారులు సూచిస్తున్నారు.

చిక్కిన చిరుత

తిరుపతి జూకు తరలించిన అధికారులు



పచ్చర్ల అటవీ ప్రాంతంలో బోనులో చిక్కిన చిరుత పులి

శిరివెళ్ల, రుద్రవరం, జూన్ 28 :(నంద్యాల-గిద్దలూరు ప్రధాన రహదారిలోని నల్లమల అటవీ ప్రాంతంలోని పచ్చర్ల చెక్ పోస్టు వెనుక వైపున ఏర్పాటు చేసిన బోనుకు చిరుత పులి చిక్కింది. అటవీశాఖ నంద్యాల డీఎఫ్‌వో అనురాగ్ మీనా, పచ్చర్ల రేంజ్ ఆఫీసర్ ఈశ్వరయ్య, నాగార్జునసాగర్ టైగర్ రిజర్వ్ వైద్యులు సంఘటనా స్థలానికి చేరుకుని చిరుతను పరిశీలించారు. ఇటీవల నల్లమల పరిసర గ్రామాల్లో చిరుత పులి దాడులు తీవ్రమైన నేపథ్యంలో అధికారులు చిరుతను బంధించడానికి బోన్లు అమర్చారు. ఈ నెల 25న కట్టెల కోసం అడవిలోకి వెళ్లిన పచ్చర్ల గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచ్ షేక్ మెహరున్నిషాపై చిరుత పులి దాడి చేసి హత మార్చిన విషయం తెలిసిందే. ఈ ఘటనతో పచ్చర్ల గ్రామస్థులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. దీంతో అటవీ శాఖ అధికారులు తరచూ చిరుత సంచరిస్తున్న ప్రాంతాల్లో పలు చోట్ల బోన్లు, ట్రాప్ కెమెరాలను అమర్చారు. ఎట్టకేలకు పచ్చర్ల చెక్‌పోస్టు సమీపంలో ఏర్పాటు చేసిన బోనుకు శుక్రవారం తెల్లవారు జామున చిరుత పులి చిక్కింది. బోనుకు చిక్కిన చిరుత పులి, మహిళపై దాడి చేసి చంపేసిన చిరుత ఒకటే అనే ప్రాథమిక అవగాహనకు అటవీ శాఖ అధికారులు వచ్చారు. ఐదారేళ్ల వయస్సు ఉన్న ఈ చిరుతను తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర జులాజికల్ పార్కుకు తరలించినట్లు ఎఫ్ఆర్‌వో ఈశ్వరయ్య వెల్లడించారు. ఇదిలా ఉండగా పచ్చర్ల అటవీ ప్రాంతంలో మరో రెండు చిరుతలు సంచరిస్తున్నాయని మహిళలు అంటున్నారు.

ప్రజలు అప్రమత్తంగాఉండాలి

నల్లమల అటవిలో మరో రెండు చిరుతలు సంచరిస్తున్నాయి. చెలిమ, రుద్రవరం రేంజ్ గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. అడవిలోకి వెళ్లాల్సి వస్తే గుంపులుగా వెళ్లాలి.

-సబ్ డీఎఫ్‌వో శ్రీనివాసరెడ్డి

డ్రైనేజీ వ్యవస్థను బాగు చేస్తాం: మంత్రి బీసీ

బనగానపల్లె, జూన్ 28 : గత వైసీపీ ప్రభుత్వం బనగానపల్లె పట్టణంలోని డ్రైనేజీ వ్యవస్థను పట్టించుకున్న పాపాన పోలేదని, తాము మెరుగుపరచడానికి చర్యలు తీసుకుంటున్నామని రోడ్లు భవనాల శాఖామంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం బనగానపల్లె పట్టణంలోని ఈద్గానగర్‌లో మురుగు కాల్వలను పరిశీలించారు. ఈ కాలనీలోని పలు ప్రాంతాల్లో మంత్రి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా కాలనీవాసులు మురుగు కాల్వల దుస్థితిని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. పంచాయతీ సిబ్బంది పని తీరు బాగ లేదని ఫిర్యాదు చేశారు. అనంతరం మంత్రి బీసీ మాట్లాడుతూ బనగానపల్లె పట్టణంలో మురుగు కాల్వలు శుభ్రం చేయించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు ప్రజలు తన దృష్టికి తెచ్చారన్నారు. గతంలో తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు డ్రైనజీ వ్యవస్థను మెరుగుపరిచామని గుర్తు చేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక మురుగు కాల్వలను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. వైసీపీ నాయకులు, కార్యకర్తల వద్ద ఇళ్ల వద్ద మాత్రమే అధికారులు మురుగు కాల్వలను నిర్మించి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. త్వరలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి పది రోజుల్లో బనగానపల్లె పట్టణంలో మురుగు కాలువల్లో పూడికతీత పనులు పూర్తి చేస్తామని చెప్పారు. ప్రతి రోజూ 150 మంది పారిశుధ్య సిబ్బందితో యుద్ధ ప్రాతిపదికన పని పూర్తి చేయిస్తానని అన్నారు. పట్టణంలో పరిశుభ్రత కోసం కొత్త వాహనాలను తెప్పిస్తామని తెలిపారు. బీసీ వెంట డీఎల్‌పీవో బాలకృష్ణుడు, గ్రామ పంచాయతీ ఈవో హరిప్రసాద్, పట్టణ ఉప సర్పంచ్ బురానుద్దీన్, మురళీమోహన్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాబుసాహెబ్, నియాజ్ హుసేన్, అల్తాఫ్‌హుస్సేన్ పాల్గొన్నారు.



ఈద్గానగర్‌లో అస్తవ్యస్తంగా ఉన్న మురుగు కాల్వలను పరిశీలిస్తున్న రోడ్లు భవనాల శాఖ మంత్రి మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

ఉపాధి పనుల్లో నాణ్యత పాటించాలి: కలెక్టర్



కౌలూరులో ఉపాధి పనులు పరిశీలిస్తున్న కలెక్టరు

పాణ్యం, జూన్ 28 : ఉపాధి పనుల్లో నాణ్యత పాటించాలని కలెక్టరు డాక్టర్ శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన కౌలూరులోని ఉపాధి పనులను, ఎస్సార్బీసీ కాల్వలో పూడికతీత పనులను పరిశీలించారు. గ్రామంలో 71 మంది ఉపాధి పనుల్లో పాల్గొన్నారని డ్వామా పీడీ రామచంద్రారెడ్డి నివేదిక అందజేశారు. గ్రామంలో 245 జాబ్ కార్డులు ఉండగా 234 మందికి పనులు కల్పించామన్నారు. గత మూడు నెలలుగా కూలీల సరాసరి రేటు రూ.260 ఉండగా ప్రస్తుత మాసంలో రూ. 280 కూలీతో పనులు చేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు ఉపయోగపడేలా పనులు చేపట్టాలని సూచించారు. కూలీలకు సరాసరి రేటు పెరిగేలా పనులు చేయించాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. బరువు తక్కువగా ఉన్న పిల్లలు, గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం పోషకాహార పదార్థాలను క్రమం తప్పకుండా ఇవ్వాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీడీ బాలాజీ నాయక్, ఎంపీడీఓ భాగ్యలక్ష్మి, ఏపీఓ విజయరాణి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ పీడీ నిర్మల, సీడీపీవో చంద్రకళావతమ్మ, ఏసీపీడీవో పద్మావతమ్మ, సూపర్‌వైజర్ నాగసుంకమ్మ పాల్గొన్నారు.

మహానంది ఈవోగా శ్రీనివాసరెడ్డి

మహానంది, జూన్ 28: మహానంది ఆలయ ఈవోగా నల్లకాలువ శ్రీనివాసరెడ్డి శుక్రవారం సాయంత్రం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈవోగా పని చేస్తున్న కాపు చంద్రశేఖర్‌రెడ్డిని బదిలీ చేస్తూ రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ కార్యాలయం నుండి ఉత్తర్వులు వచ్చాయి. ఆయన స్థానంలో కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి ఆలయ ఈవో ఎస్. శ్రీనివాసరెడ్డిని మహానంది ఆలయానికి బదిలీ చేశారు. ఈ మేరకు ఆయన దేవస్థానం ప్రధాన కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. అనంతరం నూతన ఈవో మాట్లాడుతూ మహానంది క్షేత్ర అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని తెలిపారు. అనంతరం బదిలీపై వెళ్తున్న ఈవో కాపు చంద్రశేఖర్‌రెడ్డిని సిబ్బంది సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓలు ఎర్రమల్ల మధు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



ఈవోగా బాధ్యతలు చేపడుతున్న శ్రీనివాసరెడ్డి

హరివిల్లు విరిసే.. చిరుజల్లు కురిసే..



మేఘాలు కమ్ముకున్న ఆకాశం.. భువిపై పరుచుకున్న పచ్చదనం.. ఆ పక్కనే ప్రకృతి ప్రతిబింబించే కొండలాంటి ప్రాంతం.. వెరసి వాహనదారులను అవి ఆహ్లాదపరిచాయి. చల్లటి సాయంత్రం వేళ హరివిల్లు విరిసి చిరుజల్లులకు సమయమైందని సంకేతమిచ్చింది. అలా ఇంద్రధనుస్సు కనిపించిన కాసేపటికే వాన జల్లు మొదలైంది. ప్రకృతి ప్రియులను మంత్ర ముగ్ధులను చేసింది. ఓ వైపు చిటపట చినుకులు, మరోవైపు ఆకాశాన్ని, భూమిని ఏకం చేస్తూ ఏర్పడిన ఇంద్రధనుస్సు చూపరులను కనువిందు చేశాయి. శుక్రవారం సాయంత్రం మూడు జిల్లాల సరిహద్దు ప్రాంతమైన కొలిమిగుండ్ల మండల కేంద్రంలో ఈ దృశ్యం ఆవిష్కృతమైంది.

- కొలిమిగుండ్ల రూరల్

పేరుకే పట్టణ హోదా

● అభివృద్ధికి నోచుకోని నందికొట్కూరు ● మున్సిపాలిటీలో చక్రం తిప్పుతున్న సీనియర్ సిబ్బంది ● విచ్చల విడిగా రియల్ దందా
● నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం ● తొలిసారిగా హాజరు కానున్న ఎమ్మెల్యే జయసూర్య

నందికొట్కూరు, జూన్ 28: నందికొట్కూరు మేజర్ పంచాయతీ నుంచి నగర పంచాయతీగా రూపాంతరం చెంది దాదాపు పదేళ్ల అవుతోంది. నగర పంచాయతీలో అభివృద్ధికి అవకాశం ఉంటుందని అంతా భావిస్తే పన్నులు పెరగడం మినహా మౌలిక వసతుల కల్పన కనరాని పరిస్థితి కనిపిస్తోంది. నందికొట్కూరు నగర పంచాయతీలోని 29 వార్డుల్లో 60 వేల మందిపైగా జనాభా ఉన్నారు. 29 వార్డుల్లోని 16 వార్డులు పట్టణ స్థాయిలో కనిపిస్తాయి. మిగిలిన వార్డులన్నీ పూర్తిగా గ్రామీణ వాతావరణాన్ని తలపించేవే. ఈ వార్డుల్లో ఆవాస ప్రాంతాలకు వెళ్లే రహదారులు అస్తవ్యస్తంగా మారడంతో ప్రజలు నానా పాట్లు పడుతున్నారు. పట్టణ శివారు కాలనీల్లో రహదారులు అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. దీంతో ప్రజలు నానా పాట్లు పడుతున్నారు. శనివారం నందికొట్కూరు జైకిసాన్ పార్కులో మున్సిపల్ కౌన్సిల్ సమావేశం జరగనుంది. ఈ సమావేశానికి ఎమ్మెల్యే గిత్తా జయసూర్య మొదటి సారిగా హాజరుకానున్నారు.

● మున్సిపాల్టీలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారడంతో వర్షాలకు రహదారులు మునుగుతున్నాయి. మారుతి నగర్, విలేఖరి కాలనీ, కర్నూలు రోడ్డులోని బైరెడ్డి నగర్‌లు ఇందుకు నిదర్శనంగా దర్శనమిస్తున్నాయి. కాలనీల్లో రోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మారుతి నగర్ ఎగువన వర్షం కురిస్తే పొలాల నుంచి భారీగా వరద నీరు వచ్చి కాలనీ మునిగిపోతుంది. ఆ వర్షపునీటిని మళ్లించి మారుతీనగర్‌ను, నందికొట్కూరు ప్రభుత్వ ఆసుపత్రిని ముంపు నుంచి కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

సిబ్బంది కొరత

మున్సిపాల్టీలో చెత్త సేకరణ పూర్తి స్థాయిలో పారిశుధ్య కార్మికులు లేకపోవడం ఇబ్బందిగా మారింది. 120 మంది పారిశుధ్య కార్మికులు అవసరం కాగా ప్రస్తుతం 105 మంది మాత్రమే ఉన్నారు. ఇందులో కొందరు ఆఫీసులో వర్కర్లుగాను, వాహనాలకు డ్రైవర్లుగాను విధులు నిర్వహిస్తున్నారు. దీనితో వార్డులన్నింటిలోనూ చెత్త సేకరణ సకాలంలో జరగడంలేదు. డంపింగ్ యార్డు సమస్య తీవ్రంగా వేధిస్తోంది. మున్సిపాల్టీ పరిధిలోని కుమ్మరి వీధి శివారులో డంపింగ్ యార్డు ప్రస్తుతం ఉంది. మున్సిపాల్టీకి దూరంగా బండిమెట్ల పొలిమేరలో డంపింగ్ యార్డును ఏర్పాటు చేశారు. అయితే రైతుల పొలాల్లోకి చెత్త వస్తుందని అభ్యంతరం తెలపడంతో నిలిపివేశారు.

చక్రం తిప్పుతున్న సీనియర్ సిబ్బంది

మున్సిపాలిటీ కొందరి సిబ్బంది సలహాలు లేకుండా అధికారి కూడా ముందడుగు వేయలేని పరిస్థితి. కొందరు సిబ్బంది ఏళ్ల తరబడి పాతుకుపోయారు. దీంతో వారు అధికారులను సైతం తమ గుప్పిట్లో పెట్టుకొని నందికొట్కూరు మున్సిపాల్టీలో చక్రం తిప్పుతున్నారు. కొందరు అధికారులు ప్రతి పనికో రేటు నిర్ణయించారని, ఆ ప్రకారం తమకు ముడుపులు ముట్టజెబితేనే పట్టణ ప్రజలకు పనులు జరుగుతాయన్న ప్రచారం జోరుగా సాగుతోంది.

వర్షాకాలంలో అప్రమత్తత అవసరం

మున్సిపాల్టీలో డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగాలేని పరిస్థితిలో దోమలు వ్యాప్తి చెంది వ్యాధులు విజృంభించే ఆస్కారం ఉంది. మురుగు కాలువల్లో పూడిక తొలగింపు, ఆవాస ప్రాంతాల్లో బ్లీచింగ్, ఫాగింగ్ వంటి చర్యలు చేపట్టాల్సిన ఆవశ్యకత ఉంది.

విచ్చలవిడిగా రియల్ దందా

నందికొట్కూరు మున్సిపాలిటీలో గత ఐదేళ్లలో సుమారు 80కి పైగా అక్రమ వెంచర్లు వెలిశాయి. ప్రస్తుతం నందికొట్కూరులో వెలసిన వెంచర్లలో కేవలం మూడు నాలుగు వెంచర్లకు మాత్రమే ఎల్‌పీ నెంబర్లు ఉన్నట్లు తెలుస్తోంది. మిగిలిన ఏ ఒక్క వెంచర్ కూడా ఎల్‌పీ నెంబర్ లేకుండా నిబంధనలకు విరుద్ధంగా వెలిశాయి. వీటిపై అధికారులు నోటీసులు ఇస్తూ నామమాత్రపు చర్యలు తీసుకుంటూ మమా అనిపించేస్తున్నారు. పట్టణంలో చాలా వరకు ల్యాండ్ కన్వర్షన్ లేకుండా వెంచర్లు వెలిశాయి. ల్యాండ్ కన్వర్షన్‌కు దరఖాస్తు చేసుకున్నామని, అనుమతులు వస్తాయని చెబుతూ అటు మున్సిపాల్టీకి, ఇటు రెవెన్యూ శాఖ ఆదాయానికి గండి కొడుతూ అక్రమ వెంచర్ల వ్యాపారంలో మూడు పువ్వులు ఆరు కాయలుగా నందికొట్కూరులో రియల్ ఎస్టేట్ వ్యాపారం విరాజిల్లుతుంది.

మొదటిసారిగా హాజరు కానున్న ఎమ్మెల్యే

నందికొట్కూరు మున్సిపాలిటీ రెండో పాలక వర్గం ఏర్పడిన మూడేళ్లలో ప్రతినెల జరుగుతున్న కౌన్సిల్ సమావేశానికి కోఆప్షన్ సభ్యుడి హోదాలో ఎమ్మెల్యే మొదటిసారిగా హాజరు కానున్నారు. గత వైసీపీ హయాంలో ఎమ్మెల్యే తోగూరు ఆర్థర్ తన ఐదేళ్ల కాలంలో ఒక్కసారి కూడా నందికొట్కూరు కౌన్సిల్ సమావేశానికి హాజరు కాలేదు. నేడు నందికొట్కూరు ఎమ్మెల్యేగా గిత్తా జయసూర్య ఎన్నికయ్యాక జరుగుతున్న మొదటి సమావేశానికి ఆయన హాజరు కానున్నారు.


నందికొట్కూరు మున్సిపల్ కార్యాలయం

చర్యలు చేపడుతున్నాం



మున్సిపాల్టీలోని అన్ని వార్డుల్లోనూ పారిశుధ్య చర్యలు చేపడుతున్నాం. వర్షాకాలం నేపథ్యంలో పారిశుధ్య కార్మికులతో బ్లీచింగ్ చల్లిస్తున్నాం. మురుగు కాలువల్లో ఎప్పటికప్పుడు పూడికతీత చేపడుతున్నాం.

-సుధాకర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్

కార్యాలయమా? అటెండర్ గెస్ట్ హౌసా?

● కార్యాలయానికి నేమ్ బోర్డు కూడా లేదు
● కేసీ కెనాల్ కార్యాలయ సిబ్బందిపై ఎమ్మెల్యే జయసూర్య ఆగ్రహం

నందికొట్కూరు, జూన్ 28: కేసీ కెనాల్ ఏఈ కార్యాలయమా? లేక ఇది అటెండర్ గెస్ట్‌హౌస్ అనుకోవాలా..? కనీసం కార్యాలయ భవనానికి నేమ్ బోర్డు ఏర్పాటు చేయలేని స్థితిలో అధికారులు ఉన్నారా? అంటూ నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం నందికొట్కూరు పట్టణంలోని కేసీ కెనాల్ ఏఈ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సమయంలో నందికొట్కూరు డివిజన్ కార్యాలయంలో ఒక్క లస్కర్ మినహా ఎవ్వరూ విధుల్లో లేరు. దీంతో సిబ్బంది ఎక్కడికి వెళ్లారని ఎమ్మెల్యే ప్రశ్నించారు. ప్రస్తుతం ఎంత మంది ఈ డివిజన్‌లో పని చేస్తున్నారని ప్రశ్నించగా 41 మంది లస్కర్లు పని చేస్తున్నారని విధుల్లో ఉన్న ఒక్క లస్కర్ సమాధానం తెలిపారు. లస్కర్‌ల అటెండెన్సును పరిశీలించారు. ఈనెల 21వ తేదీ నుంచి ఇప్పటి వరకు లస్కర్ల అటెండెన్సు ఎందుకు లేదని ఎమ్మెల్యే రీమార్కు రాశారు.

మంత్రిని కలిసిన ఎమ్మెల్యే


కర్నూలులో మంత్రి టీజీ భరత్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎమ్మెల్యే జయసూర్య

నందికొట్కూరు, జూన్ 28: మంత్రి టీజీ భరత్‌ను నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య మర్యాదపూర్వకంగా కలిశారు. శుక్రవారం సాయంత్రం కర్నూలు మౌర్యాఇన్‌లో హోటల్‌లో మంత్రి టీజీ భరత్‌ను ఎమ్మెల్యే జయసూర్య పూలబొకేను అందజేసి, శాలువాతో సన్మానించారు. నియోజకవర్గంలోని పలు సమస్యలను ఆయన దృష్టికి ఎమ్మెల్యే తీసుకెళ్లారు. టీడీపీ సీనియర్ నాయకులు కాతా రమేష్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, పలుచాని మహేశ్వరరెడ్డి, బ్రహ్మానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఊయల సేవ


ఊయల సేవ నిర్వహిస్తున్న అర్చకుడు

శ్రీశైలం, జూన్ 28: శ్రీశైలం మహాక్షేత్రంలో లోకకల్యాణార్థం శుక్రవారం స్వామి, అమ్మవార్లకు ఊయలసేవను ఘనంగా నిర్వహించారు. పూజా కార్యక్రమంలో ముందుగా మహాగణపతి పూజను చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్లను ఊయలలో ఆశీనులనుజేసి శాస్త్రోక్తంగా షోడశోపచార పూజలు జరిపారు. అమ్మవారికి అష్టోత్తరం, త్రిశతి, ఖడ్గమాల, సహస్ర నామపూజలు, స్వామివారికి సహస్రనామార్చన పూజలు నిర్వహించి మంగళహారతులను సమర్పించారు.

అంకాలమ్మకు పూజలు: శ్రీశైల క్షేత్ర గ్రామదేవత అంకాలమ్మకు శుక్రవారం లోకకల్యాణాన్ని ఆకాంక్షిస్తూ విశేష పూజలను దేవస్థానం నిర్వహించింది. ఈ పూజలలో భాగంగా అమ్మవారికి పంచామృతాభిషేకం, హరిద్రోదకం, కుంకుమోదకం, గంధోదకం, పుష్పోదకం, విశేష అలంకరణ, కుంకుమార్చన పూజలు నిర్వహించారు.

ఆకట్టుకున్న నిత్యకళారాధన: శ్రీశైల దేవస్థానం ధర్మపథంలో భాగంగా నిర్వహిస్తున్న నిత్యకళారాధన కార్యక్రమంలో శుక్రవారం విజయవాడకు చెందిన అభినయ ఆర్ట్స్ అకాడమీ బృందంతో సంప్రదాయ నృత్య ప్రదర్శన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. కార్యక్రమంలో మహాగణపతిం, మూషికవాహన, శివతాండవం, అయిగిరినందిని, జతిస్వరం, ఓం నమఃశివాయ తదితర గీతాలకు కళాకారులు నృత్య ప్రదర్శనతో అలరించారు.

మహానందిలో పల్లకీ ఉత్సవం


మహానందిలో పల్లకీ సేవలో పాల్గొన్న భక్తులు

మహానంది, జూన్ 28: మహానంది క్షేత్రంలో శుక్రవారం రాత్రి వైభవంగా పల్లకీ ఉత్సవాన్ని వేదపండితులు నిర్వహించారు. ముందుగా స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తుల విగ్రహాలను వేదమంత్రాలతో ఆలయ ప్రాంగణంలోని కల్యాణ మంటపం వద్దకు తీసుకొచ్చారు. భక్తి శ్రద్ధలతో పల్లకి కి ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ఆలయం మొదటి ప్రాకారంలో భక్తుల శివనామస్మరణ మధ్య పల్లకీ సేవ నిర్వహించారు. టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శశిధర్‌రెడ్డి, ప్రధాన అర్చకులు మామిళ్ళపల్లి అర్జునశర్మ, అర్చకులు రామవేంద్రశర్మ, సిబ్బంది పాల్గొన్నారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలం, జూన్ 28: శ్రీశైలం దేవస్థానం భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న నిత్యాన్న ప్రసాద వితరణ పథకానికి శుక్రవారం గుంటూరుకు చెందిన పాలుకూరి శైలజ, నరసరావుపేటకు చెందిన ఎం.ఎస్ రామలింగారెడ్డి అనే భక్తులు కుటుంబ సమేతంగా కలిసి రూ.లక్ష చొప్పున విరాళాన్ని అదజేశారు. దేవస్థానం అధికారులు దాతకు స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని, ప్రసాదాలను అందజేసి సత్కరించారు.

'దౌర్జన్యాలు చేసే సంస్కృతి మాది కాదు'

గడివేముల, జూన్ 28: దౌర్జన్యాలు చేసే సంస్కృతి తమది కాదని టీడీపీ సీనియర్ నాయకుడు పంట రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిందాల్ పరిశ్రమ ప్రారంభం నుంచి ఆ పరిశ్రమలో కాంట్రాక్టు చేస్తున్నామని, బిల్లుల లావాదేవీలపై చర్చించేందుకు వెళ్లిన తమపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు. తమకు, కంపెనీ ప్రతినిధులకు ఎలాంటి విభే దాలు లేవని అన్నారు. దిలీప్‌కుమార్‌రెడ్డి, వంశీధర్‌రెడ్డి, మద్దిలేటిరెడ్డి ఉన్నారు.

నిందితుడి అరెస్టు

శ్రీశైలం, జూన్ 28: శ్రీశైలంలో హత్యకు పాల్పడిన నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండుకు తరలించినట్లు శ్రీశైలం సీఐ ప్రసాదరావు తెలిపారు. 2023 జూలై 3న అబ్రహం, కిశోర్‌ల మధ్య గొడవ చోటుచేసుకుంది. ఈ ఘటనలో కిశోర్ అనే వ్యక్తి అబ్రహంపై దాడిచేసి చంపేశాడు. హత్య అనంతరం పరారీలో ఉన్న కిశోర్‌ను కర్నూలు జిల్లా మద్దికెర వద్ద అరెస్టు చేసినట్లు సీఐ ప్రసాదరావు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

పాణ్యం, జూన్ 28: స్థానిక వెంకటేశ్వర నర్సరీ వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నంద్యాల మండలం పోలూరు గ్రామానికి చెందిన కిరణ్‌కు గాయాలైనట్లు పాణ్యం పోలీసులు తెలిపారు. పాణ్యం వైపునుంచి నంద్యాల వైపు మోటారు సైకిల్‌పై వెళ్తుండగా నిలుచున్న లారీని వెనుకవైపు నుంచి ఢీకొట్టినట్లు తెలిపారు. క్షతగాత్రుడ్ని నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

సమస్యల పరిష్కారానికి కృషి : ఎమ్మెల్యే బుడ్డా

ఆత్మకూరు, జూన్ 28: సమస్యలను పరిష్కరించేందుకు చొరవ తీసుకుంటానని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి హామీ ఇచ్చారు. తనను ఓట్లేసి గెలిపించిన ప్రజలు కృతజ్ఞతలు తెలిపేందుకు శుక్రవారం సాయంత్రం ఆత్మకూరు పట్టణంలోని నీలితొట్లవీధి, గరీబ్‌నగర్ ఏరియాల్లో థ్యాంక్స్ ఫర్ ఓటింగ్ సదస్సులను నిర్వహించారు. ఆయా వార్డుల్లో నెలకొన్న సమస్యలపై అక్కడి మహిళలతో మాట్లాడి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే అదేక్రమంలో సంక్షేమ పథకాల వర్తింపునకు సంబంధించి తమ పార్టీ ప్రతినిధులే నేరుగా ఇళ్లవద్దకు వచ్చి వివరాలు సేకరిస్తారని, వీలైనంతవరకు అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందించి న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. అదేవిధంగా ఐదేళ్ల వైసీపీ పాలనలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి నియోజకవర్గంలో చేసిన అరాచకాలు, దౌర్జన్యాలు, అక్రమాలను కూడా ప్రజలకు వివరిస్తూ చైతన్య పరిచారు.

'ప్రజా సమస్యలపై చర్చ జరగాలి'

మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ప్రజా సమస్యలపై చర్చ జరగాలని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి అన్నారు. ఆత్మకూరులోని పట్టణ ప్రణాళిక విభాగం కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మున్సిపల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయాలకు అతీతంగా పనిచేస్తానని, మున్సిపల్ కౌన్సిలర్లు కూడా తనకు సహకరిస్తే ప్రాధాన్యతా క్రమంలో పట్టణాభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. అంతకుముందు పలు తీర్మానాలను కౌన్సిల్ దృష్టికి తీసుకురాగా వాటిని సభ్యులు ఆమోదించారు. ఎమ్మెల్యే బుడ్డాను మున్సిపల్ కమిషనర్, చైర్మన్లు సత్కరించారు. మున్సిపల్ కమిషనర్ హరిప్రసాద్, చైర్‌పర్సన్ డాక్టర్ మారూఫ్ ఆసియా, వైస్‌చైర్మన్ రాజగోపాల్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు ఉన్నారు.

'శిల్పా గుమస్తాలకు మున్సిపాలిటీ జీతాలు'

మాజీ ఎమ్మెల్యే శిల్పా వద్ద పనిచేస్తున్న షేక్ నవాబ్ అనే యువకుడికి మున్సిపాలిటీలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగిగా నియమించి నెలకు రూ.17,612 వేతనం ఇప్పించేవారని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి తెలిపారు. ఇదేతరహాలో మరో నలుగురిని కూడా నియమించారని, వారు పేరుకేమో ఉద్యోగం చేస్తున్నట్లు నటిస్తూ మాజీ ఎమ్మెల్యే శిల్పా సేవల్లో తరించేవారని ఆరోపించారు. అలాగే శిల్పా తనయుడు కార్తీక్‌రెడ్డి వెంట ఉండే బౌన్సర్లకు శ్రీశైల దేవస్థానంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులుగా నియమించి దేవస్థానం తరుపున వేతనాలు చెల్లించారని ఆరోపించారు.


థ్యాంక్స్ ఫర్ ఓటింగ్ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

బండిఆత్మకూరు: ఆత్మకూరులో ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డిని మండలానికి చెందిన సీపీఎం నాయకులు మర్యాదపూర్వకంగా కలసి శాలువాతో సత్కరించారు. సమస్యలను పరిష్కరించాలని రామచంద్రుడు, రత్నమయ్య, డేవిడ్, రాజు, సుబ్బరాయుడు వినతిపత్రం అందించారు.

వెలుగోడు: ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డిని వెలుగోడు మండల ప్రైవేట్ పాఠశాలల నిర్వాహకులు కలిసి అభినందించారు. ఆత్మకూరులోని టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే బుడ్డాను కలిసి శాలువా సన్మానించి బొకే అందజేసి అభినందించారు. ఇమ్మానియేల్, చంద్రశేఖరరెడ్డి, పయాజ్, దరగయ్య పాల్గొన్నారు.

క్లోరినేషన్ చేసిన నీటినే సరఫరా చేయాలి

● ఫ్రైడే.. డ్రైడే కార్యక్రమాన్ని నిర్లక్ష్యం చేస్తే చర్యలు
● కలెక్టర్ శ్రీనివాసులు హెచ్చరిక

నంద్యాల టౌన్, జూన్ 28: క్లోరినేషన్ చేసిన నీటినే మున్సిపల్ అధికారులు సరఫరా చేయాలని కలెక్టర్ శ్రీనివాసులు అన్నారు. ఫ్రైడే డ్రైడేలో భాగంగా నంద్యాల పట్టణంలోని ఎన్‌జీవో కాలనీ, విశ్వనగర్ నందు డ్రైడే కార్యక్రమాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ డ్రైడే కార్యక్రమాన్ని నిర్లక్ష్యం చేస్తే సంబంధిత సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. దోమల లార్వాలు వృద్ధి చెందకుండా ప్రతి గ్రామంలో ప్రతి శుక్రవారం డ్రైడే కార్యక్రమాన్ని ప్రతిష్టంగా నిర్వహించాలని అన్నారు. తప్పనిసరిగా బ్లీచింగ్ పౌడర్, వేస్ట్ ఆయిల్ స్ప్రే చేయాలని సూచించారు. డెంగీ, చికెన్ గున్యా, మలేరియా, మెదడు వాపు వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సచివాలయ ఆరోగ్య కార్యకర్తలు, వైద్యాధికారులు, మున్సిపల్ అధికారులను ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ, మున్సిపల్ కమీషనర్ నిరంజన్‌రెడ్డి, మలేరియా అధికారి కామేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

నంద్యాల (నూనెపల్లె): సీజన్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ యునాని వైద్యురాలు షమీమ్ ఉన్నిసా అన్నారు. శుక్రవారం నంద్యాలలోని టెక్కె మున్సిపల్ హైస్కూల్‌లో యునాని వైద్యశాల సిబ్బంది ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. మున్సిపల్ హైస్కూల్ హెచ్‌ఎం ఖాదర్ బాషా, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మకూరు రూరల్: డయేరియా, మలేరియా ప్రబలకుండా గ్రామాల్లో అన్ని ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు వైద్యాధికారి పవన్‌కుమార్,పంచాయతి కార్యదర్శి ప్రభాకర్‌లు పేర్కొన్నారు. శుక్రవారం ఆత్మకూరు మండలంలోని వెంకటాపురం గ్రామంలో సీజన్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. సూపర్‌వైజర్ పద్మావతమ్మ, సీహెచ్‌వో యశోద, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


నంద్యాలలో పరిసరాలను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీనివాసులు

బండిఆత్మకూరు: ప్రతి ఒక్కరూ పరిశుభ్రంగా ఉంటూ, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎఎన్ఎం వెంకటసుబ్బమ్మ సూచించారు. శుక్రవారం డ్రైడేలో భాగంగా మురుగు ఆవాసాల వద్ద బ్లీచింగ్ చల్లించారు. అలాగే త్రాగు నీటి ట్యాంక్‌లు, మినరల్ వాటర్ ప్లాంట్‌లను పరిశీలించారు. ఆశాలు, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

కొత్తపల్లి: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు విష జ్వరాలతో అప్రమత్తంగా ఉండాలని, లార్వా నివారణే లక్ష్యంగా వైద్య సిబ్బంది పని చేయాలని వైద్యాధికారులు జబీర్ హకీం రషీద్ సూచించారు. ఎర్రమఠం పాత మాదుగుల ఎర్రమఠం చెంచుగూడెంలో వైద్యాధికారులు ఇంటింటికి వెళ్లి దోమ లార్వా నివారణ గురించి వివరించారు. హెల్త్ అసిస్టెంట్లు సత్యంరెడ్డి, శాంతమ్మ, సబ్ యూనిట్ అధికారి కృష్ణారెడ్డి, వైద్యసిబ్బంది ఉన్నారు.

'కౌలు కార్డులు పొందాలి'

జూపాడుబంగ్లా, జూన్ 28: ఖరీఫ్‌లో పొలాన్ని కౌలుకు తీసుకున్న ప్రతి రైతు గ్రామరెవెన్యూ అధికారి వద్ద కౌలురైతు గుర్తింపుకార్డు పొందాలని వ్యవసాయ అధికారి కృష్ణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీ విత్తనాలు, ఎరువులు పొందాలంటే కౌలుకార్డు తప్పనిసరి అన్నారు. కౌలుకార్డు పొందిన తర్వాత రైతు భరోసా కేంద్రాల్లో రిజిస్టర్ చేయించుకోవాలని సూచించారు.

పాఠశాలల తనిఖీ

పాములపాడు, జూన్ 28: నేషనల్ హైవే పనుల్లో కూల్చిన పాఠశాలలను డీఈవో సుధాకర్‌రెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఎంఈవో బాలాజీనాయక్‌తో కలసి క్రిష్ణరావుపేట, రుద్రవరం గ్రామంలోని పాఠశాలలను పరిశీలించి వాటి స్థానంలో నూతన నిర్మాణాలు చేపట్టాల్సిన అంశాలపై అధికారులతో చర్చించారు. డీఈవో మాట్లాడుతూ రుద్రవరం గ్రామంలో ఉన్న స్థలంలోనే కట్టుదిట్టమైన భద్రతతో విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా నిర్మిస్తామన్నారు. నాయకులు అధికారులతో చర్చించి నిర్ణయం తీసుకొంటామని తెలిపారు. పాములపాడులో కేజీబీవీలో జరుగుతున్న నాడు-నేడు పనులను పరిశీలించారు. తరగతులకు వెళ్లి విద్యార్థులతో మాట్లాడుతూ బాగా చదవాలని సూచించారు. క్రిష్ణరావుపేట పాఠశాలకు రూ.13 లక్షలు, రుద్రవరం పాఠశాలకు రూ.62 లక్షలు వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

'ఫీజుల దోపిడీని అరికట్టాలి'

ఆత్మకూరు: ఆత్మకూరు ప్రాంతంలోని ప్రైవేట్, కార్పోరేట్ పాఠశాలల్లో అధిక ఫీజులను అరికట్టాలని ఎస్ఎఫ్ఐ నాయకులు దినేష్‌కుమార్ నంద్యాల డీఈవో సుధాకరరెడ్డికి శుక్రవారం కొత్తపల్లిలో విన్నవించారు. వారు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న విద్యా కానుకలను పంపిణీ చేయాలని కోరారు. మూతబడిన ప్రభుత్వ పాఠశాలలను పునఃప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు.

ఎంఈవోలపై డీఈవో ఆగ్రహం

జూపాడుబంగ్లా: రోజూ చేయాల్సిన పనులు చేయకుండా అలసత్వం ప్రదర్శిస్తున్న ఎంఈవోలపై డీఈవో సుధాకర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం మండలంలోని మండ్లెం జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల, జూపాడుబంగ్లాలోని ప్రభుత్వఉన్నత పాఠశాల, ఆదర్శపాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎంఈవో శ్రీనివాసులు ఎవరికి చెప్పి సెలవు పెట్టారని, తయారు చేయాల్సిన రిపోర్టులు కూడా సరిగా చేయడంలేదని ఆయనపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆదర్శ పాఠశాల వద్ద విద్యార్థుల తల్లిదండ్రులతో డీఈవో మాట్లాడారు. ఎంఈవో -1 చిన్నమద్దిలేటి, ఆదర్శపాఠశాల ప్రిన్సిపల్ రమేష్, సీఆర్‌పీలు పాల్గొన్నారు.


పాములపాడు కేజీబీవీలో పుస్తకాన్ని పరిశీలిస్తున్న డీఈవో

'క్రమశిక్షణతో కూడిన విద్యను అందించాలి'

కొత్తపల్లి: విద్యార్థులకు క్రమ శిక్షణతో కూడిన విద్యను అందించాలని డీఈవో సుధాకర్ రెడ్డి ఉపాధ్యాయులకు సూచించారు. గోకవరం, జడ్పీహెచ్ఎస్, లింగాపురం ఎంపీపీఎస్, కొత్తపల్లి జడ్పీహెచ్ఎస్, కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. లింగాపురం ఎంపీపీఎస్ పాఠశాలను డీఈవో తనిఖీ చేయగా.. ఆ గ్రామానికి చెందిన 60 మంది విద్యార్థులు దగ్గరలో ఉన్న గోకవరం హైస్కూల్‌కు వెళ్లకుండా సుమారు 3 కిలోమీటర్ల దూరంలో ఉన్న కొత్తపల్లి హైస్కూలుకు వెళ్తున్నట్లు డీఈవో తనిఖీలో వెల్లడైంది. వెంటనే డీఈవో విద్యార్థుల తల్లిదండ్రులతో అత్యవసర సమావేశం ఏర్పాటుచేసి గోకవరం పాఠశాలకు వెళ్లే విదంగా వారికి అవగాహన కల్పించారు. ఆత్మకూరు ఎంఈవో బాలాజీ నాయక్, గోకవరం హెచ్ఎం వెంకటరమణాచారి, ఉపాధ్యాయులు ఉన్నారు.

టీడీపీతోనే బీసీల అభ్యున్నతి

● జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్



మల్లెల రాజశేఖర్‌ను సన్మానిస్తున్న గౌడ సంఘం నాయకులు

నంద్యాల (నూనెపల్లె), జూన్ 28: సామాజిక, ఆర్థిక, రాజకీయంగా బీసీల అభ్యున్నతి టీడీపీతోనే సాధ్యమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ అన్నారు. జిల్లా గౌడ సంఘం అధ్యక్షుడు శేషాద్రి గౌడ్ ఆధర్యంలో శుక్రవారం నంద్యాలలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో మల్లెల రాజశేఖర్‌ను కలిసి సత్కరించారు. నంద్యాల జిల్లాలో టీడీపీ క్లీన్ స్వీప్ చేయడంపై అభినందించారు. మల్లె రాజశేఖర్ మాట్లాడుతూ.. బీసీలందరూ ఏకతాటిపై నిలబడి టీడీపీని గెలిపించారని అన్నారు. బీసీ కార్పోరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలను అందించి బీసీలు ఆర్థిక పరిపుష్టిని సాధించేలా చంద్రబాబు కృషి చేస్తారని అన్నారు. కార్యక్రమంలో జిల్లా గౌడ సంఘం నాయకులు కృష్ణగౌడ్, రవీంద్ర గౌడ్, జగన్, రామగౌడ్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పీవీ నరసింహారావుకు ఘన నివాళి


నివాళి అర్పిస్తున్న నంది రైతు సమాఖ్య సభ్యులు

నంద్యాల (కల్చరల్), జూన్ 28: మాజీ ప్రధాని పీవీ నరసింహారావు 103 వ జయంతిని శుక్రవారం నంద్యాలలో ఘనంగా నిర్వహించారు. విశ్రాంత శాస్త్రవేత్త రవీంద్రనాథ్, డాక్టర్ కిషోర్‌కుమార్ పీవీ నరసింహారావు చిత్రపటం వద్ద నివాళి అర్పించారు. నందిరైతు సమాఖ్య కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వివిధ సాహితీ సంస్థల ప్రతినిధులు పీవీ నరసింహారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. డాక్టర్ రవీంద్రనాథ్ మాట్లాడుతూ బహుబాషా కోవిదుడుగా, రచయితగా బారతీయ భాషల సాహిత్యాభివృద్ధికి పీవీ ఎనలేని కృషి చేశారని అన్నారు. నంద్యాలలో వ్యవసాయ కళాశాల, బ్రాడ్‌గేజ్ రైల్వే, ఉపరితల వంతెన ఏర్పాటు పీవీ హయాంలో జరగడం నంద్యాల ప్రజల అదృష్టమన్నారు. ఆర్థిక సంస్కరణల ద్వారా దేశాన్ని ప్రగతి బాటన నడిపించిన రాజనీతిజ్ఞుడుగా పివి చరిత్రలో నిలిచారని వక్తలు కొనియాడారు. నరసింహ అనే ప్రత్తి వంగడాన్ని పివి చేతుల మీదుగా ఆవిష్కరించబడటం నంద్యాల చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచిందని అన్నారు. రఫీ, లక్ష్మయ్య, హుసేని, ఓబులపతి, మాధవస్వామి సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ

మిడుతూరు, జూన్ 28: మిడుతూరు ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులకు టీడీపీ మండల కన్వీనర్ కాతా రమేష్ రెడ్డి ఆధ్వర్యంలో విద్యా సామగ్రిని శుక్రవారం అందజేశారు. 6,7,8,9,10 తరగతుల 600 మంది విద్యార్థులకుపాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, బ్యాగులు అందజేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ సలీంబాషా తెలిపారు. సర్పంచ్ జయలక్ష్మమ్మ, కాతా విష్ణువర్ధన్ రెడ్డి, యరబం ప్రమోద్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రయోగశాలలో విద్యార్థులకు గాయాలు

పాణ్యం, జూన్ 28: మండలంలోని ఒక ప్రైవేటు కళాశాలలో శుక్రవారం ప్రయోగశాలలో విద్యార్థులు ప్రయోగాలు నిర్వహిస్తుండగా జరిగిన పొరపాటుతో విద్యార్థులకు స్వల్ప గాయాలైనట్లు తెలిసింది. దీంతో విద్యార్థులు సమీప ఆసుపత్రిలో చికిత్స చేయించుకొని తిరిగి కళాశాలకు వెళ్లినట్లు తెలిసింది. దీనిపై ప్రిన్సిపాల్‌ను వివరణ కోరగా ప్రయోగశాలలో ఇటువంటివి సర్వసాధారణమని, విద్యార్థులు తిరిగి ప్రయోగశాలలో ప్రయోగాలు నిర్వహించారని అన్నారు. విద్యార్థులకు ఎటువంటి ప్రమాదం లేకపోవడంతో కళాశాల సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు.

భవన నిర్మాణ కార్మికుడి మృతి

నంద్యాల (నూనెపల్లె), జూన్ 28: భవననిర్మాణ కార్మికుడు మహ్మద్‌గౌస్ (62) ప్రమాద వశాత్తు కింద పడి మృతి చెందాడు. మండలంలోని పోలూరు గ్రామానికి చెందిన మహ్మద్ గౌస్ నంద్యాల పట్టణ త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో జ్ఞానాపురంలో భవన నిర్మాణంలో పని చేస్తున్నాడు. ప్రమాద వశాత్తు బిల్డింగ్‌పై నుంచి కాలు జారి కింద పడటంతో స్థానికులు చికిత్స నిమిత్తం నంద్యాల సరోజ ఆసుపత్రికి తరలించారు. అయితే కోలుకోలేక మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు త్రీటౌన్ పోలీసులు తెలిపారు.

బీరు బాటిళ్ల అమ్మకాల నిలిపివేత

నంద్యాల (నూనెపల్లె), జూన్ 28: జిల్లాలో కింగ్‌ఫిషర్ కంపెనీకి చెందిన బీర్ బాటిళ్ల అమ్మకాలను నిలుపుదల చేస్తున్నట్లు జిల్లా సెబ్ అధికారి మణికంట తెలిపారు. మూడు రోజుల క్రితం బేతంచెర్లలోని ఓ ప్రభుత్వ మద్యం దుకాణంలో వినియోగ దారుడు కొనుగోలు చేసిన కింగ్ ఫిషర్ బీరు సీసాలో ఓ ప్లాస్టిక్ స్పూన్ ఉండటాన్ని గుర్తించి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈసంఘటనపై ఎక్సైజ్ ఉన్నతాదికారుల దృష్టికి తీసుకెళ్లామని, బ్యాచ్ నంబర్ 48 ఉన్న బీర్ బాటిళ్ళ అమ్మకాలను ప్రభుత్వ వైన్ షాపుల్లో అ్మకాలు నిలుపుదల చేయాలని ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. ఆ బ్యాచ్ నంబరు ఉన్న బీర్ బాటిళ్లను తనిఖీ చేయాలని ఆదేశించినట్లు తెలిపారు.

వడివడిగా అడుగులు

- హామీల అమలు దిశగా పాలన
- పేదలు, రైతులు, నిరుద్యోగుల్లో హర్షాతిరేకాలు



కర్నూలు(కలెక్టరేట్), జూన్ 28:

సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించి కొలువు తీరిన టీడీపీ ప్రభుత్వం పాలనపై దృష్టి సారించింది. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తొలి అడుగు వేశారు. రాష్ట్ర క్యాబినెట్ హామీలపై ఆమోదం తెలిపారు. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో ఒక్క డీఎస్సీ కూడా నిర్వహించలేదు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ హడావుడి చేసినా నోటిఫికేషన్‌తో డీఎస్సీ ఆగిపోయింది. అయితే టీడీపీ అధికారంలోకి రాగానే సీఎం చంద్రబాబు నాయుడు తొలి సంతకం డీఎస్సీపై చేశారు. దీంతో నిరుద్యోగులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

అన్న క్యాంటీన్లు

పేదలకు తక్కువ ధరకే భోజనం అందించాలనే లక్ష్యంతో టీడీపీ ప్రభుత్వం అన్న క్యాంటీన్లను ప్రారంభించింది. రాష్ట్రంలో 2018 జూలై 11న అన్న క్యాంటీన్లను సీఎం చంద్రబాబు నాయుడు ప్రారంభించారు. క్వాలిటీ, క్వాంటిటీ విషయంలో రాజీ పడకుండా పేదలకు నాణ్యమైన ఆహారాన్ని అన్న క్యాంటీన్ల ద్వారా అందించారు. పేదలకు పట్టెడన్నం పెట్టే ఉద్దేశంతోనే అన్న క్యాంటీన్లను టీడీపీ ప్రభుత్వం కేవలం రూ.5కే అందించారు. ప్రతి రోజూ ఉదయం అల్పాహారంతోపాటు మధ్యాహ్నం, రాత్రి భోజనం ప్రజలకు అందుబాటులో ఉండనున్నది. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు దివంగత మాజీ సీఎం ఎన్టీ రామారావు పేరు మీద టీడీపీ ప్రభుత్వం అన్నా క్యాంటీన్లను రాష్ట్ర వ్యాప్తంగా 2018 జూన్ 11న ఏర్పాటు చేసింది. అన్న క్యాంటీన్ల నిర్వహణ కోసం అక్షయపాత్ర అనే స్వచ్ఛంద సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంది. రోజుకు దాదాపు 2.25 లక్షల మంది, రాష్ట్ర వ్యాప్తంగా 7.25 కోట్ల మంది ఆకలిని తీర్చేలా అన్నా క్యాంటీన్లు పని చేశాయి. ఒక్క క్యాంటీన్‌లో ఉదయం 300 మందికి అల్పాహారం, మధ్యాహ్నం 360 మందికి, రాత్రి 250 మందికి ప్రతి రోజూ రూ.5కు నాణ్యమైన భోజనం అందించారు. ఇలా పేదలకు కడుపునిండా అన్నం పెట్టే క్యాంటీన్లను వైసీపీ ప్రభుత్వం మూసివేయించింది. తిరిగి ఇప్పుడు టీడీపీ అధికారంలోకి రావడంతో త్వరలో అన్న క్యాంటీన్లు ప్రారంభం కానున్నాయి.



ఎన్టీఆర్ భరోసా పథకం



వృద్ధాప్య, వితంతు, చేనేత, కల్లుగీత, మత్స్యకార, ఒంటరి మహిళలు, డప్పు కళాకారులు తదితర పింఛన్ల మొత్తాన్ని రూ.3వేలు నుంచి రూ.4వేల వరకు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. ఏప్రిల్, మే, జూన్ నెలలకు రూ.వెయ్యి చొప్పున రూ.4వేలు కలిపి మొత్త రూ.7వేలు జూలై 1వ తేదీన సచివాలయ ఉద్యోగులు ఇంటి వద్దనే అందజేస్తారు. దివ్యాంగులు, క్షయ వ్యాధిగ్రస్తులకు ఇస్తున్న పింఛన్ రూ.3 వేల నుంచి రూ.6 వేలకు పెంచారు. దివ్యాంగులకు రూ.5 వేలు, కిడ్నీ బాధితులకు రూ.15 వేలు, లివర్, బైలేట్రల్ ఎలిఫెంటాసిస్ వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి రూ.5వేల నుంచి రూ.10వేలు ఇవ్వనున్నారు. జిల్లాలో వృద్ధాప్య పింఛన్లు 1,26,152, వితంతు 71,519, వికలాంగుల పింఛన్లు 31,510, చేనేత కార్మికులు 2,948, కల్లుగీత కార్మికులు 242, హిజ్రాలు 241, ఒంటరి మహిళలు 5,883, మత్స్య కార్మికులు 817, సీకేడీయూ (ప్రభుత్వం) 127, సీకేడీయూ (ప్రైవేటు) 245, కిడ్నీ, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థులు 787, డప్పు కళాకారులు 1,457, చర్మకారులతోపాటు 1,142, సైనిక్ వెల్ఫేర్ పింఛన్లు 6, కళాకారుల పింఛన్లు 39, అభయ పింఛన్లు 2,572 ఉన్నాయి.

2,678 టీచర్ పోస్టులు



జిల్లాలో మెగా డీఎస్సీ ద్వారా 2,678 టీచర్ పోస్టులు భర్తీ కానున్నాయి. ఇందులో 1,801 సెకండరీ గ్రేడ్ టీచర్లు, మిగతా తెలుగు, హిందీ, ఇంగ్లీషు తదితర స్కూల్ అసిస్టెంట్ పోస్టులు ఉన్నాయి. టీడీపీ ప్రభుత్వం త్వరలో టెట్, డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేయనున్నది. ఇటీవల బీఎడ్, డీఎడ్ పూర్తి చేసుకున్న వారికి, గతంలో టెట్ అర్హత పొందలేని వారికి ఒక సువర్ణ అవకాశం కల్పించనున్నది. గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో ఒక డీఎస్సీ కూడా నిర్వహించలేదు. డీఎస్సీలో 20 శాతం టెట్ వెయిటేజీ ఇవ్వనున్నారు.

నైపుణ్యాలు పెంచడమే లక్ష్యం

స్కిల్ ప్రొఫైల్స్, స్కిల్ నీడ్స్, స్కిల్ ఇన్ డిమాండ్, స్కిల్ లభ్యత మధ్య అంతరాన్ని గుర్తించడం, అంచనా వేయడం, తదనుగుణంగా నైపుణ్య అభివృద్ధి శిక్షణలో డిజైన్ చేసేలా ప్రభుత్వానికి సమాచారం అందించడం, మార్కెట్ అవసరాలకు అనుగుణంగా యువతకు నైపుణ్య శిక్షణ అందిస్తారు. డిగ్రీ, ఇంజనీరింగ్, పాలిటెక్నిక్, ఐటీఐ కళాశాలలో నైపుణ్యాలు లేకపోవడం వల్ల ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించకపోవడంతో నిరుద్యోగ సమస్య విపరీతంగా పెరిగిపోయింది. నైపుణ్యాలు పెంపొందించి విద్యార్థులకు, యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడం ప్రధాన ఉద్దేశం.



ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దు

రిజిస్ట్రేషన్, రెవెన్యూ న్యాయ వ్యవస్థలను అస్తవ్యస్తంగా ఉన్న ల్యాండ్ టైటిలింగ్ యాక్టును టీడీపీ ప్రభుత్వం ఇటీవల రద్దు చేసింది. వైసీపీ ప్రభుత్వం తీసుకువచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్టు ద్వారా రైతులు చాలా ఇబ్బంది పడ్డారు. తరతరాల నుంచి వస్తున్న భూమి పాస్ పుస్తకంపై, సర్వే రాళ్లపైన జగన్ బొమ్మ వేశారు. నీతి అయోగ్ ప్రతిపాదించిన నమూనా చట్టానికి జగన్ ప్రభుత్వం తీసుకువచ్చిన చట్టానికి అసలు ఏ మాత్రం సంబంధం లేదు. భూ వివాదాలపై జిల్లా కోర్టులు, సివిల్ కోర్టులకు పరిధి లేకుండా చేసి హైకోర్టును మాత్రమే ఆశ్రయించేలా ఈ చట్టం తెచ్చారు. సన్న, చిన్న కారు రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేశారు. కూటమి ప్రభుత్వం రావడంతో ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దు చేయడంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు.

డీఎస్సీ శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

కర్నూలు(ఎడ్యుకేషన్), జూన్ 28: మెగా డీఎస్సీ (ఎస్‌జీటీ) కోసం ఉచిత శిక్షణ కావాలని అనుకొనే అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి, ఏపీబీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ వెంకటలక్ష్మమ్మ శుక్రవారం తెలిపారు. ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన డీఈడీ, టీటీసీ, ఏపీ టెట్‌లో అర్హత సాధించిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ అభ్యర్థులు తమ దరఖాస్తులను కర్నూలు అబ్బాస్‌నగర్, కల్లూరు ఎమ్మార్వో ఆఫీసు ఎదురుగా ఏపీ బీసీ స్టడీ సర్కిల్‌కు వచ్చి జూలై 10వ తేదీలోపు సమర్పించాలన్నారు. అభ్యర్థుల ఎంపిక డీఈడీ మెరిట్ ఆధారంగా జరుగుతుందన్నారు. ఎంపికైన అభ్యర్థులకు కర్నూలు బీసీ స్టడీ సర్కిల్‌లో 60 రోజుల పాటు ఉచిత శిక్షణ ఉంటుందని అన్నారు. వివరాల కోసం 08518-236076 నెంబరులో సంప్రదించాలన్నారు.

పెద్దాసుపత్రిలో ఎఫ్‌ఆర్‌ఎస్ బయోమెట్రీ తప్పనిసరి

వైద్యులు, పారా మెడికల్ నర్సులు హాజరు వేయాల్సిందే

కర్నూలు(హాస్పిటల్), జూన్ 28: కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో పని చేస్తున్న వైద్యులు, సిబ్బంది పని వేళలు పాటించాలని, ఎఫ్‌ఆర్‌ఎస్ బయోమెట్రీ తప్పక వేయాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.సి. ప్రభాకర్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఆసుపత్రి సిబ్బంది డ్యూటీ వేళల ప్రకారం సమయానికి ముఖ హాజరు (ఎఫ్‌ఆర్‌ఎస్) వేయాలన్నారు. వైద్యులు, సీఎస్‌ఆర్‌ఎంవో, డిప్యూటీ సీఎస్‌ఆర్‌ఎంవో, ఏఆర్‌ఎంవో, మెడికల్ ఆఫీసర్లు (స్టోర్) హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్, ప్రొఫెసర్లు, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు హాస్పిటల్‌లో అందు బాటులో ఉండాలన్నారు. మినిస్ట్రీరియల్ ఉద్యోగులు ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విధులు నిర్వహించాలన్నారు. నర్సులు, పారా మెడికల్ సిబ్బంది, ల్యాబ్ టెక్నీషియన్లు తమ షిఫ్టు ప్రకారం రోజుకు 3సార్లు తమ హాజరును సమర్పించాలని అధికారులు, హెచ్‌వోడీలను ఆదేశించారు. హౌస్ సర్జన్లు, డ్యూటీ డాక్టర్లు షిఫ్టుల ప్రకారం ముఖ హాజరు ఎఫ్‌ఆర్‌ఎస్ సమయానికి సమర్పించాలని, లేకపోతే జీతంలో కోత విధిస్తామని హెచ్చరించారు.

జిల్లా అభివృద్ధికి కృషి చేస్తా

- కార్యాచరణ ప్రణాళికను అమలు చేస్తాం
- బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్ రంజిత్‌బాషా



కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న రంజిత్‌బాషా

కర్నూలు(కలెక్టరేట్), జూన్ 28: ప్రజాప్రతినిధులు, ప్రజల సహకారంతో కర్నూలు జిల్లాను అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని కలెక్టర్ పి.రంజిత్ బాషా పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో ఉదయం 10:15 గంటలకు జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మత పెద్దలు సర్వమత ప్రార్థనలు నిర్వహించి కలెక్టర్‌ను ఆశీర్వదించారు. అనంతరం కలెక్టర్ విలేకరులతో మాట్లాడుతూ కర్నూలు జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు తీసుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. కర్నూలు తనకు సొంత జిల్లాలాగా ఉందన్నారు. స్వస్థలం నందికొట్కూరు నియోజకవర్గం అని, తన విద్యాభ్యాసం కొంత వరకు ఉమ్మడి కర్నూలు జిల్లాలోనే జరిగిందన్నారు. దాదాపు 20 సంవత్సరాల కిందట ఉద్యోగ రీత్యా కర్నూలు జిల్లాను విడిచి వెళ్లానని అన్నారు. మరలా ఇప్పుడు కలెక్టర్‌గా సొంత జిల్లాకు రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. ప్రజాప్రతినిధులు, జిల్లా ప్రజల సహకారంతో జిల్లా అభివృద్ధికి కార్యాచరణ ప్రణాళికతో కృషి చేస్తానన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యతలకు అనుగుణంగా కార్యచరణ ప్రణాళికను రూపొందించుకుని అమలు చేస్తానన్నారు. జిల్లా ప్రజలందరికీ మేలు చేకూరే విధంగా జిల్లా అడ్మినిస్ట్రేషన్ తరుపున తీసుకోవాల్సిన అన్ని రకాల చర్యలు తీసుకుంటాననీ స్పష్టం చేస్తా అన్నారు. అనంతరం నూతన కలెక్టర్‌కు జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, ఆదోని సబ్ కలెక్టర్ శివ్‌నారాయణ్‌శర్మ, డీఆర్వో మధుసూదన్‌రావు, జిల్లా అధికారులు తదితరులు పుష్పగుచ్ఛాలతో అభినందనలు తెలిపారు.



కలెక్టర్‌ను అభినందిస్తున్న జేసీ

బీహార్ మహిళ ఆత్మహత్య

బేతంచెర్ల, జూన్ 28: కర్నూలు రహదారిలోని అయ్యలచెరువు ప్రాంతంలో ఉన్న ఒక పాలిష్ ఫ్యాక్టరీలో పని చేసే బీహార్‌కు చెందిన గురూజీ సింగ్ భార్య నేహ కుమారి పాండే (23 ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన ఆలస్యంగా శుక్రవారం సాయంకాలం వెలుగులోకి వచ్చింది. నేహా కుమారి పాండేకు, గురూజీసింగ్‌లకు ఈ ఏడాది ఏప్రిల్ 24న వివాహమైంది. అతనిది బీహార్ రాష్ట్రం సారెన్ జిల్లా పటేల్ గ్రామం. అయితే బతుకుతెరువు కోసం అతను బేతంచర్ల శ్రీనివాసరెడ్డి నాపరాళ్ల ఫ్యాక్టరీలో పని చేస్తున్నాడు. నేహ కుమారి పాండే మూడు రోజుల క్రితం బేతంచెర్లకు వచ్చింది. గురువారం సాయంత్రం ఆమె ఉరి వేసుకుని అనుమానాస్పద స్థితిలో ఆత్మహత్య చేసుకుంది. ఈ విషయమై పోలీసులను అడుగగా తమకు ఎలాంటి సమాచారం లేదని అన్నారు.

ఫ్లెక్సీ చించారని కేసు నమోదు

కర్నూలు, జూన్ 28: నంద్యాల చెక్‌పోస్టు సమీపంలో మంత్రి పవన్ కళ్యాణ్ ఫ్లెక్సీ చించివేయడంతో కేసు నమోదైంది. ప్రవీణ్ కుమార్ అనే వ్యక్తి మంత్రి పవన్ కళ్యాణ్ ఫ్లెక్సీని చెక్‌పోస్టులో ఏర్పాటు చేశారు. డేవిడ్ అనే వ్యక్తి ఈ ఫ్లెక్సీ చించడంతో ప్రవీణ్ కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు త్రీటౌన్ సీఐ మురళీధర్ రెడ్డి తెలిపారు.

జడ్పీలో ఎన్నికల వేడి..

- రెండువర్గాలుగా ఉద్యోగులు
- పంతం నెగ్గించుకునేందుకు పట్టుబడుతున్న ఓ వర్గం ఉద్యోగులు



కర్నూలు(న్యూసిటీ), జూన్ 28: ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం ఎన్నికలు జిల్లా పరిషత్‌లో త్వరలో జరగనున్నాయి. ఉమ్మడి జిల్లాలోని తాలూకా యూనిట్ల ఎన్నికలు ముగిశాయి. ఈ క్రమంలో జిల్లా పరిషత్ యూనిట్ ఎన్నికలు నిర్వహించేందుకు సంఘం నాయకులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. అయితే గత కాలంగా జడ్పీ యూనిట్‌లో రెండు వర్గాలుగా ఉద్యోగులు విడిపోయారు. ప్రస్తుతం ఎన్నికలు సమీపిస్తుండంతో ఎన్నికల వేడి మొదలైంది. ఇరువర్గాలు తమ పంతం నెగ్గించుకునేందుకే పావులు కదుపుతున్నారు.

ఐదేళ్లు పూర్తి చేసుకున్న వారు ఎన్నికల బరిలో

యూనిట్ పరిధిలో ఐదు సంవత్సరాలు సర్వీసు పూర్తి చేసుకున్న ఉద్యోగులు ఎలాగైన ఎన్నికల్లో పోటీ చేసి గెలుపొంది ఇక్కడే ఉండేందుకు ప్రయత్నిస్తున్నారు. అయితే కొందరు ఉద్యోగులు దీనిని అడ్డుకుంటున్నారు. దీంతో అసలు కథ ఇక్కడే మొదలైంది. ఐదు సంవత్సరాలు పూర్తి కాని వారు మాత్రమే పోటీ చేయాలని కొందరు అంటుంటే..లేదు ఐదు సంవత్సరాలు పూర్తయిన వారు కూడ పోటీ చేయవచ్చని మరో వర్గం భీష్మించుకుని ఉంది. దీంతో రెండువర్గాల మధ్య వైరం నెలకొంది.

చక్రం తిప్పుతున్న ఓ అధికారి..



ఎంతో కాలంగా జిల్లా పరిషత్ యూనిట్ పరిధిలో పని చేస్తున్న ఓ అధికారి దీనంతటికీ చక్రం తిప్పుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. దీంతో పాటు ఇప్పటికే అన్ని తాలూకాలలో ఎన్నికలు ముగిశాయి. చివరికి మిగిలింది జిల్లా పరిషత్ యూనిట్ మాత్రమే. ఇది పూర్తయిన వెంటనే జిల్లా ఎన్నికలను నిర్వహించుకోవాలి. దీంతో జడ్పీ యూనిట్ ఎన్నికలపైనే ప్రతి ఒక్కరి దృష్టి పడింది. దీంతో పాటు ఎన్నికల పోలింగ్ సెలవురోజుల్లో కాకుండా పని రోజుల్లోనే నిర్వహించుకోవాలని ఓ వర్గం ఆలోచిస్తుంది. అయితే పని రోజుల్లో కాకుండా కేవలం సెలవురోజుల్లోనే ఎన్నికలు జరపాలని మరో వర్గం పట్టుబట్టింది. అయితే మొత్తం యూనిట్ పరిధిలో 114 మంది ఓటర్లు ఉండగా ఇందులో సుమారు 70 మందికి పైగా సెలవురోజుల్లో ఎన్నికలు నిర్వహించరాదని...కేవలం పనిరోజుల్లో ఎన్నికలు నిర్వహించాలని సంతకాలు చేశారు. వారానికి ఒక్కరోజు వచ్చే సెలవు రోజు కూడ ఇంట్లో గడపకుండా కార్యాలయానికి వస్తే ఎలా అని కొందరు ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు. దీంతో జిల్లా పరిషత్ యూనిట్ ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారనేది రాష్ట్ర మినిస్టీరియల్ ఎన్నికల సంఘం నాయకుల వద్ద పంచాయతీకి చేరింది.

తెలంగాణ మద్యం బాటిళ్లు సీజ్



మద్యం బాటిళ్ల రవాణా కేసులో నిందితులతో సెబ్ అధికారులు

కర్నూలు(అర్బన్), జూన్ 28: తెలంగాణ నుంచి జిల్లాలోకి తరలిస్తున్న 215 మద్యం బాటిళ్లు సీజ్ చేశామని సెబ్ సీఐ రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. శుక్రవారం సూపరింటెండెంట్ ఎస్. రవికుమార్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో పెద్దపాడు వద్ద పెద్దకొట్టాలకు చెందిన షేక్షావలి నుంచి 144, దూపాడు గ్రామానికి చెందిన ఈశ్వరమ్మ నుంచి 71 తెలంగాణ మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకొని కేసులు నమోదు చేశామని తెలిపారు. ఈ దాడుల్లో డీటీఎఫ్ సీఐ నరసానాయుడు, ఎస్ఐ రెహనాబేగం, మారుతి ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

రాఘవేంద్రుని సన్నిధిలో ప్రముఖులు



బంగారు పల్లకి మోస్తున్న కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి

మంత్రాలయం, జూన్ 28: మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దర్శనార్థం నెల్లూరు జిల్లా కావలి టీడీపీ ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి, కర్ణాటక హైకోర్టు జడ్జి జస్టిస్ అశోక్ కినగి, రాయచూరు జిల్లా ఏఎస్పీ హరీష్ కుటుంబ సమేతంగా శుక్రవారం వేర్వేరు సమయాల్లో రాఘవేంద్ర స్వామిని దర్శించుకున్నారు. మహా ముఖ ద్వారం వద్ద మఠం మేనేజర్లు ఎస్ కే శ్రీనివాసరావు, వెంకటేష్ జోషి, శ్రీపతి ఆచార్, ఐపీ నరసింహమూర్తిలు వారికి ఘనంగా స్వాగతం పలికారు. గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి విశేష పూజలు చేశారు. అనంతరం మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు మెమెంటో, శేషవస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు. హైకోర్టు జడ్జి శుక్రవారం రాత్రి మంత్రాలయంలో బస చేసి శనివారం రాఘవేంద్రస్వామిని దర్శించుకోనున్నారు. వీరి వెంట ఏఏఓ మాధవశెట్టి, మంత్రాలయం ఎస్ఐ గోపినాథ్, బిందు మాధవ్, అనంతస్వామి, ప్రకాశ్ ఆచార్, భీమ్‌సేన్ ఆచార్, పవన్‌ఆచార్, వ్యాసరాజార్ తదితరులు పాల్గొన్నారు.

బాబా బృందావన్ నగర్‌లో చోరీ

కర్నూలు, జూన్ 28: నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని బాబా బృందావన్ నగర్‌లో భారీ చోరీ జరిగింది. శ్రీనివాసరావు అనే వ్యక్తి ఇంట్లో దొంగలు నగదు, బంగారు నగలు అపహరించారు. కొలిమిగుండ్ల మండలానికి చెందిన ఈయన వృత్తిరీత్యా రైతు. కర్నూలులో స్థిరపడ్డాడు. కొడుకు, కూతురు అమెరికాలో ఉంటుండగా.. భార్యాభర్తలు ఇద్దరూ బాబా బృందావన్ నగర్‌లో ఉంటున్నారు. ఈ నెల 19వ తేదీన సొంత పని నిమిత్తం కొలిమిగుండ్లకు వెళ్లారు. తిరిగి శుక్రవారం కర్నూలు వచ్చారు. ఇంటి తలుపులు తెరిచి ఉండడం చూసి నిర్ఘాంతపోయారు. బీరువా అంతా చిందర వందరగా పడి ఉండటంతో చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. శుక్రవారం రాత్రి పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. 45 తులాల మేర బంగారు ఆభరణాలు, కిలో వెండి, టీవీ, కొంత నగదును అపహరించినట్లు పోలీసులు గుర్తించారు. క్లూజ్ టీమ్‌లు వివరాలు సేకరిస్తున్నాయి. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శంకరయ్య తెలిపారు.

రేపు కోవెలకుంట్లకు మంత్రి బీసీ రాక



కోవెలకుంట్ల, జూన్ 28: ఆంధ్రప్రదేశ్ రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఆదివారం కోవెలకుంట్లకు వస్తున్నట్లు మండల టీడీపీ అధ్యక్షుడు అమడాల మద్దిలేటి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల జరిగిన ఎన్నికల్లో బనగానపల్లె నుంచి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి 25565 ఓట్ల మెజార్టీతో గెలుపొందడమే కాకుండా మంత్రి వర్గ విస్తరణలో రోడ్లు భవనాలు, మౌలిక వసతులు పెట్టుబడుల శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత మొట్టమొదటిసారిగా ఆదివారం ఉదయం 10గంటలకు కోవెలకుంట్లలో టీడీపీ కార్యాలయంలో జరిగే కార్యకర్తల సమావేశానికి ముఖ్యఅతిథిగా మంత్రి బీసీ హాజరవుతున్నట్లు తెలిపారు. కాబట్టి మండలంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు హాజరై కార్యక్రమం విజయవంతం చేయాలని ఆయన కోరారు.

మాట నిలుపుకున్న సీఎం : సర్పంచ్

డోన్(రూరల్), జూన్ 28: తెలుగుదేశం కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన వెంటనే పింఛన్ల పెంపు అమలు చేస్తామని రాష్ట్ర ముఖ్య మంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారనీ వెంకటనాయునిపల్లె గ్రామ సర్పంచ్ శీలం చంద్రశేఖర్ నాయుడు కొనియాడారు. శుక్రవారం ఆయన కార్యాయలంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.4వేలు పెంచిన పింఛన్‌తో పాటు 3 నెలలకు రూ.1000 చొప్పున మొత్తం కలిపి రూ.7వేలు చెల్లిస్తామని సీఎం చంద్రబాబు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారని అన్నారు. వచ్చే నెల 1న లబ్ధిదారులకు సచివాలయం ద్వారా నేరుగా ఇంటి వద్దకే పింఛన్ల పంపిణీ కార్యక్రమం చేపడుతారన్నారు. వెంకటనాయునిపల్లె గ్రామ టీడీపీ అభిమానులు పాల్గొన్నారు.

రెండో విడత ప్రవేశానికి దరఖాస్తులు

డోన్(రూరల్), జూన్ 28: 2024-25 విద్యాసంవత్సరానికి ప్రభుత్వం, ప్రైవేటు ఐటీఐలలో రెండో విడత ప్రవేశం కోసం ఆసక్తిగల అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని డోన్ ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ ప్రసాద్ రెడ్డి కోరారు. ఈనెల 29వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని వాటి ప్రింట్, ఒరిజినల్ సర్టిఫికెట్లతో జూలై 25వ తేదీ ప్రభుత్వ ఐటీఐలలో సంప్రదించి వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు.

312 మంది విద్యార్థులు ఎంపిక: ఉపాధి, శిక్షణ శాఖ డైరెక్టర్ ఆదేశాల మేరకు డోన్ ప్రభుత్వ ఐటీఐలో శుక్రవారం జరిగిన క్యాంపస్ రిక్రూట్ మెంటు డ్రైవ్‌లో 312 మంది విద్యార్థులు ఎంపికయ్యారని డోన్ ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ ప్రసాద్ రెడ్డి తెలిపారు. జిల్లాలోని వివిధ ప్రభుత్వ ఐటీ ఐలలో చదువుకున్న సీనియర్ విద్యార్థులు 450 మంది హాజరు కాగా, వీరిలో 312 మంది ఎంపికైనట్లు తెలిపారు. పలు కంపెనీలకు సంబంధించిన ప్రతినిధులు హాజరైనట్లు ఆయన తెలిపారు.

ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న విజయకుమార్

డోన్(రూరల్), జూన్ 28: పట్టణంలోని బీసీ బాలికల గురుకుల హాస్టల్‌లో పిల్లలపై నిర్లక్ష్యం వహించిన ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని ఎన్ఎస్‌యుఐ జిల్లా ఉపాధ్యక్షుడు తెలుగు విజయకుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం డోన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో జ్యోతిరావుపూలే బీసీ బాలికల గురుకుల హాస్టల్‌లో ఇద్దరు విద్యార్థినులు తప్పిపోవడంపై సిబ్బంది, ప్రిన్సిపాల్ నిర్లక్ష్యమే కారణమని ధ్వజమెత్తారు. హాస్టల్‌లో ఉండాల్సిన విద్యార్థినులు రైలు ఎక్కి కర్నూలు చేరుకున్నారని, పోలీసుల సహకారంతో వారిని గుర్తించి తల్లిదండ్రుల చెంతకు చేర్చారన్నారు. ఈ సమావేశంలో నాయకులు మధు, హర్ష, సుధీర్, రవి, మధు పాల్గొన్నారు.

గుండె పోటుతో మహిళా కూలీ మృతి



మృతి చెందిన మునెమ్మ

కొలిమిగుండ్ల రూరల్, జూన్ 28: మండలంలోని కోరుమానుపల్లె గ్రామానికి చెందిన తలారి మునెమ్మ (60) మహిళా కూలీ మృతి చెందింది. మునెమ్మ గ్రామంలో వ్యవసాయ కూలీ పనులు చేసుకొని జీవనం సాగిం చేంది. శుక్రవారం కూలీ పనికి వెళ్లిన మునెమ్మ ఛాతిలో నొప్పి అంటూ కింద పడిపోగా ఆసుపత్రికి తరలించేలోపే మృతి చెందినట్లు భర్త అంకాలు వాపోయాడు. దీంతో గ్రామంలో విషాదం నెలకొంది.

కార్పొరేషన్ చైర్మన్ పదవి కాపులకే ఇవ్వాలి

కోవెలకుంట్ల, జూన్ 28: రాష్ట్ర కాపు కార్పొరేషన్ చైర్మన్ పదవి రాయలసీమ కాపులకే ఇవ్వాలని సౌత్ ఇండియా కాపు అసోసియేషన్ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాలయ్యగారి శ్రీనివాసులు డిమాండ్ కోరారు. శుక్రవారం ఆయన కోవెలకుంట్లలో విలేకరులతో మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం కాపులకు మాయమాటలు చెప్పి వారికి ఓట్లు వేయించుకుని అధికారంలోకి వచ్చిన తరువాత అప్పటి సీఎం జగన్ కాపులకు తీవ్ర అన్యాయం చేశారన్నారు. కార్పొరేషన్‌లు ఏర్పాటు చేశారే కానీ వాటిలో చిల్లిగవ్వ లేకుండా చేసి కాపు ప్రజలకు తీరని అన్యాయం చేశారని అన్నారు. టీడీపీ ప్రభుత్వంలో అయినా కాపులకు న్యాయం జరిగేలా సీఎం చంద్రబాబు , ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌లు చూడాలని అన్నారు. కాపుసంఘం జిల్లా జనరల్ సెక్రటరీ చౌడయ్య, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీకి సిద్ధం

కోవెలకుంట్ల, జూన్ 28: మండలంలో జూలై 1న 6041 మందికి పింఛన్లు పంపిణీ చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఎంపీడీవో సయ్యదు స్నీసా తెలిపారు. శుక్రవారం ఆమె ఎంపీడీవో కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ 1న ఉదయం సచివాలయ సిబ్బందితో పాటు వివిధశాఖలకు చెందిన సిబ్బంది ఇంటి వద్దకు వెళ్లి లబ్ధిదారులకు ఒక్కొక్కరికి రూ.7వేలు చొప్పున పంపణీ చేస్తారన్నారు. జూలైకు సంబంధించి 4వేలు, ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించి ఒక్కో నెలకు వెయ్యి చొప్పున రూ.3వేలు, జూలై నెలది 4వేలు కలిపి మొత్తం 7వేలు పంపిణీ చేస్తారన్నారు. ఇప్పటికే పింఛను డబ్బులు పంపిణీ చేసేందుకు మ్యాపింగ్ చేశామని తెలిపారు.

నోటు పుస్తకాల పంపిణీ

బేతంచెర్ల, జూన్ 28: మండలంలోని సీతారాంపురం గ్రామంలోని రెండు ప్రాథమిక పాఠశాలలకు చెందిన 120 మంది విద్యార్థులకు గ్రామానికి చెందిన దాత లక్ష్మీనారాయణ నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లను శుక్రవారం పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు షేక్ వజీదున్నీసాబీ పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చౌడేశ్వరీమాతకు పల్లకీ సేవ

బనగానపల్లె, జూన్ 28: మండలంలోని నందవరం చౌడేశ్వరీమాత ఆలయంలో శుక్రవారం అమ్మవారికి పల్లకీసేవ నిర్వహించారు. ఆలయ ఈవో కామేశ్వరమ్మ, పూజారుల ఆధ్వర్యంలో అమ్మవారిని పల్లకీలో ఊరేగించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కాలభైరవుడికి విశేష పూజలు

కొలిమిగుండ్ల రూరల్, జూన్ 28: కొలిమిగుండ్లలోని లక్ష్మీనృసింహ కొండపై వెలసిన కాలభైరవస్వామికి శుక్రవారం విశేష పూజలు నిర్వహించారు. జేష్ట మా సం, బహుళ అష్టమి పురస్కరించుకొని ఆలయ నిర్వాహకులు పేరం బయ్యపురెడ్డి, నందకిశోర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు మహేష్‌శర్మ స్వామి వారి కి అభిషేకాలు, అర్చనలు చేశారు. భక్తులు స్వామి వారిని దర్శించుకొని పూజలు చేశారు.

మున్సిపాలిటీని ఉన్నతంగా తీర్చిదిద్దుతా: ఎమ్మెల్యే



ఎమ్మెల్యే అఖిలప్రియను సన్మానిస్తున్న మున్సిపల్ చైర్మన్

నంద్యాల, జూన్ 28(ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ మున్సిపాలిటీని ఉన్నతంగా తీర్చిదిద్దుతానని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే అఖిలప్రియ అన్నారు. ఆళ్లగడ్డ మున్సిపల్ కౌన్సిల్ సమావేశం శుక్రవారం చైర్మన్ రామలింగారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఆళ్లగడ్డ ఎమ్మెల్యేగా ఎన్నికైన అఖిలప్రియను మున్సిపాలిటీ కౌన్సిల్ సభ్యులు సన్మానించాలన్న తీర్మానాన్ని చైర్మన్ ప్రవేశ పెట్టారు. దీంతో మున్సిపల్ కౌన్సిల్ సభ్యులందరూ, కమిషనర్ రమేష్ బాబు, సన్మానానికి హాజరైన మెప్మా సభ్యులు, సచివాలయాల సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు ఎమ్మెల్యేను శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మున్సిపాలిటీలో సమావేశాలు నిర్వహించుకునేందుకు అవసరమైన భవన నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. సమావేశంలో వైస్ చైర్మన్ నాయబ్ రసూల్, కౌన్సిల్ సభ్యులు హుసేన్‌బాషా, పడకండ్ల సుధామణి తదితరులు పాల్గొన్నారు.

'ఆర్ఎంపీల సమస్యల పరిష్కారానికి కృషి': ఆర్ఎంపీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే అఖిలప్రియ అన్నారు. పట్టణంలోని ఆమె స్వగృహంలో శుక్రవారం గ్రామీణ వైద్యులు కలిసి ఆమెను ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ వైద్యులు ఎదుర్కొంటున్న సమస్యలను తన దృష్టికి తెస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆర్ఎంపీల సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

'చంద్రబాబు పాలనలో ప్రజలకు భరోసా'

చాగలమర్రి: ముఖ్యమంత్రి చంద్రబాబు సమర్థవంతమైన పాలనతో ప్రజలకు భరోసా వచ్చిందని చిన్నవంగలి గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు లక్ష్మీకాంత్‌రెడ్డి, నరేంద్రారెడ్డి, సంజీవరెడ్డి అన్నారు. శుక్రవారం ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ నివాసంలో ఆమెకు శాలువ, పూల మాలలతో సన్మానించారు. పలు సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. వారు మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలకు న్యాయం చేయా లని కోరారు. మేనిఫెస్టోలో ఇచ్చిన 5 హామీలను సీఎం చంద్రబాబు సంతకం చేయడం పట్ల హర్షం ప్రకటించారు. నాయకులు నర్సిరెడ్డి, సంజీ వ్‌కుమార్‌రెడ్డి, శ్రీరామ్‌రెడ్డి, అనిల్‌కుమార్‌రెడ్డి, నందీశ్వర్‌రెడ్డి, గురు శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.



ఆళగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

మంత్రి బీసీని కలిసిన టీడీపీ నాయకులు



మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిని కలిసిన టీడీపీ నాయకులు

అవుకు, జూన్ 28: బనగానపల్లె పట్టణంలో రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిని కొండమనాయునిపల్లె గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు సుబ్బయ్య, రాయలసీమ ఉద్యమ నాయకుడు సీమకృష్ణ శుక్రవారం కలిశారు. మంత్రి బీసీకి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకుడు సుబ్బయ్య మాట్లాడుతూ కొండమనాయునిపల్లె గ్రామంలో నెలకొన్న సమస్యలను మంత్రి బీసీ దృష్టికి తీసుకెళ్లామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు శ్రీరాములునాయక్, చిన్న బాలసుంకన్న, పెనుగొండ నారాయణస్వామి, వేల్పులహరి, వెం కటన్న, రమేష్, నాగేంద్ర పాల్గొన్నారు.

హుండీ ఆదాయం రూ.1.57 లక్షలు

శిరివెళ్ల, జూన్ 28: నంద్యాల-గిద్దలూరు ప్రధాన రహదారిలో కొలువైన సర్వలక్ష్మీ నరసింహ స్వామి ఉపాలయానికి చెందిన హుండీ లెక్కింపు ద్వారా రూ.1,57,320 ఆదాయం వచ్చినట్లు ఈవో బీవీ నరసయ్య శుక్రవారం తెలిపారు. దాదాపు మూడు నెలల కాల వ్యవధికి గాను భక్తులు సమర్పించిన హుండీ కానుకలను దేవదాయ శాఖ బనగానపల్లె డివిజన్ తనిఖీ అధికారి హరిశ్చంద్రారెడ్డి పర్యవేక్షణలో లెక్కించారు. కార్యక్రమంలో వెలుగోడు మహేష్, అన్నెం విజయ భాస్కర్‌రెడ్డి, రామనాగిరెడ్డి, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ అడ్మిషన్లపై విచారణ జరపాలి

డోన్(రూరల్), జూన్ 28: డోన్ జ్యోతిరావుపూలే ఇంటర్ మొదటి సంవత్సరంలో జరిగిన అక్రమ అడ్మిషన్ల అక్రమాలపై సమగ్ర విచారణ జరపాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సూర్యప్రతాప్ డిమాండ్ చేశారు. శుక్రవారం సీపీఐ కార్యాలయంలో వారు మాట్లాడారు. నాయకులు మనోజ్, శశిధర్ రెడ్డి, ధనుష్, మహ్మద్ కైఫ్ పాల్గొన్నారు.

మహాసభను జయప్రదం చేయండి

డోన్(రూరల్), జూన్ 28: ప్రకాశం జిల్లా ఇడుముడిలో జూలై 7న జరిగే మాదిగల జనజాతర మహాసభను జయప్రదం చేయాలని ఎమ్మార్పీ ఎస్ జిల్లా కన్వీనర్ కే.రాజు పిలుపునిచ్చారు. శుక్రవారం డోన్ అంబేడ్కర్ విగ్రహం వద్ద సభకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. నాయకులు జీవన్, రాజశేకర్, సురేంద్ర, ప్రసాద్, దేవ, అప్పరాజు, నారాయణ పాల్గొన్నారు.

రేషన్ డీలర్ షిప్‌లకు పోటీ

డోన్ నియోజకవర్గంలో ఎవరి ప్రయత్నాలు వారివే

డోన్, జూన్ 28: డోన్ నియోజకవర్గంలో డీలర్ షిప్‌ల కోసం టీడీపీలో తీవ్ర పోటీ నెలకొంది. డీలర్‌షిప్‌లను దక్కించుకునేందుకు ఎవరి ప్రయత్నాలు వారు ముమ్మరంగా చేస్తున్నారు. వీటికి తోడు ప్రస్తుతం డీలర్లుగా కొనసాగుతున్న పలువురు వైసీపీ కార్యకర్తలు డీలర్‌షిప్‌లను నిలబెట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. డోన్ మున్సిపాలిటీలో 27 చౌక దుకాణాలు ఉండగా.. రూరల్‌లో 47 చౌక దుకాణాలు ఉన్నాయి. ప్యాపిలి మండలంలో 54, బేతంచెర్ల మండలంలో 44 డీలర్‌షిప్‌లు ఉన్నాయి. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ప్రస్తుతం డోన్ నియోజకవర్గంలో డీలర్‌షిప్‌లపైనే అందరి దృష్టి పడింది. డీలర్‌షిప్‌ల కోసం టీడీపీలోనే తీవ్ర పోటీ నెలకొంది. ఒక్కో డీలర్‌షిప్ కోసం ఐదారుగురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పోటీ పడుతున్నారు. వార్డు, గ్రామ స్థాయిలలో డీలర్‌షిప్‌లను చేజిక్కించుకునేందుకు డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మల వద్దకు క్యూ కడుతున్నారు. టీడీపీలో గ్రామ, వార్డు స్థాయి నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసి డీలర్‌షిప్‌లు కేటాయించాలని కోట్ల దంపతులు నిర్ణయించినట్లు తెలిసింది.

● **పైరవీలు ముమ్మరం:** డోన్ నియోజకవర్గంలోని బేతంచెర్ల మండలంలో డీలర్‌షిప్‌లను దక్కించుకునేందుకు వైసీపీ నాయకులు పైరవీలు ముమ్మరం చేసినట్లు తెలిసింది. ప్రస్తుతం డీలర్లుగా కొనసాగుతున్న కొందరు వైసీపీ నాయకులు తిరిగి కొనసాగేలా ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. ఆ మేరకు టీడీపీ నాయకుల వద్దకు రాయబారాలు పంపి డీలర్‌షిప్‌లను నిలబెట్టుకునేందుకు వారు పావులు కదుపుతున్నారు. ఈ ప్రయత్నాలు ఏ మేర ఫలించేదీ వేచి చూడాల్సిందే.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



అధికారులతో మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి

బేతంచెర్ల, జూన్ 28: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి డా.వెంకటరమణ సూచించారు. శుక్రవారం పట్టణంలోని 3, 1వ ఆరోగ్య ఉప కేంద్రాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఆరోగ్య ఉప కేంద్రాలలో రోగులకు అందుచున్న వైద్యసేవలపై ఆయన ఆరా తీశారు. అనంతరం 20వ వార్డులో సంజీవనగర్ కాలనీ సందర్శించి డెంగీ కేసులను పరిశీలించి నీటి తొట్టిల్లో ఉన్న లార్వాలను పారబోయించారు. మధ్యాహ్నం పట్టణ ఆరోగ్య కేంద్రం 1ని సందర్శించారు. అనంతరం శ్రీనగర్ కాలనీ సందర్శించి అక్కడ ఉన్న డెంగీ కేసును పరిశీలించారు. ఆయన వెంట జిల్లా మలేరియా అధికారి, జిల్లా సహాయ అధికారి, వైద్యాధికారులు డా.వైబీ ప్రియాంక, డా.తస్లీమా, మలేరియా సబ్ యూనిట్ అధికారి వెంకటేశ్వర్లు, వైద్యసిబ్బంది ఉన్నారు.

అవుకు: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఉప్పలపాడు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ నవీన్ అన్నారు. శుక్రవారం ఎంపీడీవో మల్‌రెడ్డి, ఈవో అశ్వనీకుమార్, ఆరోగ్య కార్యకర్తలు కలసి అవుకు పట్టణంలోని మార్కెట్‌వీధి, ఎస్సీ కాలనీల్లో పర్య టించి పారిశుధ్య సిబ్బందితో వీధుల్లో క్లోరినేషన్ చేయించారు. ఈ సందర్భంగా డాక్టర్ నవీన్ మాట్లాడుతూ ఇళ్లు, పరిసరాలు శుభ్రంగా లేకపోతే దోమ ఉధృతి పెరుగుతుందన్నారు. దోమకాటుకు గురైన, కలుషిత నీరు తాగినా డయేరియా వ్యాధి బారిన పడతారన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

చిరు ధాన్యాలతో ఆదాయం పెంచుకోవాలి



చిరుధాన్యాలతో విలువ ఆధారిత ఉత్పత్తులపై శిక్షణ ఇస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

బనగానపల్లె, జూన్ 28: చిరుధాన్యాలతో ఆదాయ వనరులను పెంచుకోవాలని కేవీకే సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ రమణయ్య అన్నారు. శుక్రవారం యాగంటిపల్లె కృషి విజ్ఞానకేంద్రంలో టాటా పవర్ ప్రాజెక్టు, బీఏఐఎఫ్ సంయుక్త ఆధ్వర్యంలో వేములపాడు, గోకులదిన్నె గ్రామాల పొదుపు మహిళలకు మూడు రోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రమణయ్య మాట్లాడుతూ చిరుధాన్యాలతో విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై మెలకువలను వివరించారు. కొర్రలు, రాగులు, సజ్జలు, జొన్నలతో స్వీట్లు, స్నాక్స్, మధ్యాహ్న భోజన పదార్థాలు, వివిధ ఆకు కూరలు ఉపయోగించి ఉత్పత్తుల తయారీ గురించి శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో సురేశ్‌కుమార్, శాస్త్రవేత్తలు రవిగౌడ్, లక్ష్మీప్రియ, శ్రీనివాస్, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

'రైతులకు అందుబాటులో ఉండాలి'

చాగలమర్రి, జూన్ 28: గ్రామాల్లో వ్యవసాయాధికారులు, విస్తరణాధికారులు అందుబాటులో ఉండాలని ఆళ్లగడ్డ వ్యవసాయ సహాయ సంచాలకుడు రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం చాగలమర్రి 3వ ఆర్‌బీకేలో వ్యవసాయాధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. వ్యవసాయశాఖ కార్యక్రమాల గురించి ఏడీఏ తెలియజేశారు. పంటలకు కావాల్సిన ఎరువులు, కలుపు, పురుగుల యాజమాన్యం గురించి రైతులకు గ్రామాల్లో అవగాహన కల్పించాలని అన్నారు. ఎరువులు ఆర్‌బీకేల్లో అందుబాటులో ఉంచాలని అన్నారు. పీఎం కిసాన్ లబ్ధిదారుల్లో 5 శాతం వెరిఫికేషన్ పూర్తి చేయాలని లేకపోతే అనర్హులవుతారన్న విషయం సంబంధిత రైతులకు తెలిపి వెరిఫికేషన్ పూర్తి చేయాలని సూచించారు. ఆళ్లగడ్డ టెక్నికల్ ఏవో నాగేంద్రప్రసాద్, ఏవో రంగనేతాజీ, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

మినుము పంట పరిశీలన



మినుము పంటను పరిశీలిస్తున్న ఏవో శ్రీక్రిష్ణ

రుద్రవరం, జూన్ 28: మండలంలోని ఎర్రగుడిదిన్నె గ్రామంలో శుక్రవారం మినుము పంటను వ్యవసాయాధికారి శ్రీకృష్ణ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మినుముపంటను రసం పీల్చు పురుగు ఆశించినట్లు గుర్తించామని తెలిపారు. ఖరీఫ్ సీజన్‌లో ఎర్రగుడిదిన్నె గ్రామంలో సుమారు 500 ఎకరాలు మినుము పంట రైతులు సాగు చేశారన్నారు. ప్రధానంగా రసం పీల్చు పురుగు నివారణ కోసం ఎకరాకు 5ఎంఎల్‌వేప నూనె పిచికారీ చేయాలన్నారు. ఎకరాకు 40 జిగురుఅట్టలు ఏర్పాటు చేయాలన్నారు. అధిక వర్షాల వల్ల మొక్కల్లో ఎదుగుదల లేదన్నారు. దీని కోసం ఎకరాకు కేజీ 19.19.19 పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఈవో రాజు, ఎంపీఈవో భవాని పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన అటవీ అధికారులు

రుద్రవరం: ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియను, టీడీపీ నాయకుడు భార్గవరామనాయుడును శుక్రవారం రుద్రవరం ఫారెస్టు రేంజ్ అధికారులు మర్యాదపూర్వకంగా కలిశారు. అఖిలప్రియకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే స్పందిస్తూ అటవీశాఖ విధు ల్లో సక్రమంగా నిర్వర్తించి అడవుల అభివృద్ధికి కృషి చేయాలని సూచిం చారు. కార్యక్రమంలో రేంజర్ శ్రీపతినాయుడు, డిప్యూటీ రేంజర్ ముర్తుజావలి, సెక్షన్ ఆఫీసర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ: మండలంలోని ఆలమూరు గ్రామానికి చెందిన టీడీపీనాయకుడు ముఖ్లరాజా సతీమణి హాజీమున్నీ (43), అదే గ్రామానికి చెందిన వెంకటమ్మ (90) అనే వృద్ధురాలు అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. ఎమ్మెల్యే అఖిలప్రియ గ్రామానికి చేరుకుని మృతదేహాలపై పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

'పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి'

ఉయ్యాలవాడ, జూన్ 28: మండలంలోని అన్ని గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి ఉంచామని ఈవోపీఆర్డీ మహీంద్రరెడ్డి తెలిపారు. డ్రైడే.. ఫ్రైడే కార్యక్రమంలో భాగంగా ఉయ్యాలవాడలో పారిశుధ్య పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి శుక్రవారం మురుగు కాలువలను శుభ్రం చేయిస్తున్నామన్నారు. హెల్త్ సూపర్‌వైజర్ దస్తగిరి, గ్రామ కార్యదర్శి జయరామిరెడ్డి, శానిటేషన్ కో-ఆర్డినేటర్ రమణారెడ్డి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

భూసార పరీక్షలతో పంటకు మేలు: ఏవో

కొలిమిగుండ్ల రూరల్, జూన్ 28: భూసార పరీక్షలతో రైతులకు మేలు జరుగుతుందని కొలిమిగుండ్ల మండల వ్యవసాయాధికారి బి.జ్యోతి అన్నారు. శుక్రవారం మండలంలోని నందిపాడు, హనుమంతుగుండం, బి.ఉప్పలూరు గ్రామాల్లో ఏవో పర్యటించారు. ఈ సందర్భంగా రైతు భరోసా కేంద్రాలను తనిఖీ చేశారు అనంతరం రైతులతో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. మట్టి నమూనా సేకరించే పద్ధతులపై వ్యవసాయ సిబ్బందికి, రైతులకు అవగాహన కల్పించారు.

'నేను బడికి పోతా' అవగాహన ర్యాలీ



అవగాహన ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

చాగలమర్రి, జూన్ 28: చాగలమర్రి గ్రామంలో నేను బడికి పోతా అవగాహన ర్యాలీ శుక్రవారం నిర్వహించారు. పశుసంవర్థకశాఖ ఏడీ వరప్రసాద్, హెచ్ఎం విజయలక్ష్మి, ఎంఈవో అనూరాధ ఆధ్వర్యంలో బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు పురవీధుల గుండా అవగాహన ర్యాలీ నిర్వహించారు. బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలని, పిల్లలు ఉండాల్సింది పనిలో కాదు బడిలో ఉండాలంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ చేశారు. తల్లిదండ్రులు తమ పిల్లలను బడిలో చేర్పించి విద్యాభివృద్ధికి తోడ్పడాలని కోరుతూ ర్యాలీ చేశారు.

వసుధా ఫౌండేషన్ చేయూత

బనగానపల్లె, జూన్ 28: మండలంలోని యాగంటిపల్లెకు చెందిన తలారి బాలన్న అనారోగ్యంతో బాధపడుతుండడంతో వారి కుటుంబానికి వసుధా ఫౌండేషన్ చేయూతనిచ్చింది. ఫౌండేషన్ కోఆర్డినేటర్ టంగుటూరు శ్రీనయ్య చేతులమీదుగా వారి కుటుంబానికి రూ.10వేలు శుక్రవారం ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ బురానుద్దీన్, బండి కుమార్‌రెడ్డి, టీచర్ నాగరాజు, లాయర్ నాగేంద్రారెడ్డి, మల్లారెడ్డి, ఖాదర్, పాల్గొన్నారు.

'ఇంటి వద్దకే పింఛన్'

చాగలమర్రి, జూన్ 28: చాగలమర్రి మండలంలో జూలై 1 నుంచి ఇంటి వద్దకే సచివాలయ ఉద్యోగులచే పింఛన్‌లు పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీవో సూర్యనారాయణరెడ్డి తెలిపారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ 17 సచివాలయాల పరిధిలో 140 మంది సచివాలయ ఉద్యోగులు ఉన్నారని, వారితో ఇంటి వద్దకే పింఛన్‌లను పంపిణీ చేస్తామని అన్నారు. ఉపాధి హామీ, వెలుగు సీసీలు, పంచాయతీ రెగ్యులర్ ఉద్యోగులను కూడా తీసుకుంటున్నామని అన్నారు. 6,406 పింఛన్‌లు ఉన్నాయని చెప్పారు. కార్యక్రమంలో ఈవో ప్రకాష్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

'మలేరియాతో అప్రమత్తంగా ఉండాలి'

చాగలమర్రి, జూన్ 28: గ్రామాల్లో ప్రజలు మలేరియాతో అప్రమత్తంగా ఉండాలని ఆళ్లగడ్డ సబ్‌యూనిట్ అధికారి శివచంద్రారెడ్డి, ఆరోగ్య విస్తరణాధికారి వెంకటేశ్వర్లు సూచించారు. శుక్రవారం మండలంలోని శెట్టివీడు గ్రామంలో డెంగీ లక్షణాలు ఉన్న మహిళ కుటుంబం వద్దకు వెళ్లి పైరిత్రం ద్రావణంతో పిచికారీ చేయించారు. లార్వా నివారణకు చర్యలు తీసుకున్నారు. అనంతరం పురవీధుల గుండా సీజన్ వ్యాధుల నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యదర్శి దస్తగిరి, సీహెచ్‌వో వాణి, ఏఎన్ఎం నిర్మల, ఆశా వర్కర్ రేష్మా పాల్గొన్నారు.

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోండి



మాట్లాడుతున్న ఎంఈవోలు

కోవెలకుంట్ల, జూన్ 28: విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోవెలకుంట్ల ఎంఈవోలు వెంకట్రామిరెడ్డి, వెంకటసుబ్బయ్యలు ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలకు సూచించారు. శుక్రవారం కోవెలకుంట్ల పట్ట ణంలోని ఎంఈవో కార్యాలయంలో ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇతర గ్రామాల నుంచి పాఠశాలలకు విద్యార్థులను ప్రైవేటు బస్సుల్లో తీసుకుని వచ్చేటప్పుడు డ్రైవర్లు జాగ్రత్తగా బస్సును నడిపి సురక్షితంగా గమ్యస్థానం చేరుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల యజమానులు ఎస్ఏ గఫూర్, శ్రీనివాసయాదవ్, గురుస్వామి, వినోద్‌కుమార్, సప్తగిరి నాగేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

ముగిసిన ధార్మిక కార్యక్రమాలు

నంద్యాల, జూన్ 28(ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ మండలంలోని బాచేపల్లె తండాలోని సంత్ శ్రీసేవాలాల్ మహారాజ్ మందిరంలో తిరుమల-తిరుపతి దేవస్థానముల ఆధ్వర్యంలో గత నాలుగు రోజుల నుంచి జరిగిన ధార్మిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు ముగిశాయి. ఈకార్యక్రమాల్లో శ్రీమద్రారామాయణం, మహాభారతం, భగవద్గీతలపై ఇస్కాన్ ధర్మప్రచారకులు నిత్యతృప్తదాస్, శీల హరిదాస ఠాకూర్ దాస్ ధార్మిక ప్రవచనాలు భక్తులను ఆకట్టుకున్నాయి. శుక్రవారం ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు, గోపూజ, కుంకుమా ర్చనలతో ముగిశాయి. టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ జిల్లా శాఖ నిర్వాహకులు వెంకట్‌రెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

'అతిసారతో అప్రమత్తంగా ఉండాలి'

నంద్యాల, జూన్ 28(ఆంధ్రజ్యోతి): అతిసారతో అప్రమత్తంగా ఉండాలని అహోబిలం ఆయుర్వేద వైద్యురాలు సునీత సూచించారు. అహోబిలం గ్రామంలోని గిరిజన పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వర్షాకాలంలో సీజన్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని అన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, కలుషితమైన నీరు, ఆహారం తీసుకోవద్దని సూచించారు.

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడికి అభినందనలు

ప్యాపిలి, జూన్ 28: అమరావతిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన పార్టీ రాష్ట్ర నూతన అధ్యక్షుడు గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసయాదవ్ ప్రమాణ స్వీకారం కార్యక్రమానికి టీడీపీ రాష్ట్ర బీసీ సాధికార సమితి కన్వీనర్ వై నాగేశ్వరరావుయాదవ్ పాల్గొన్నారు. పల్లా శ్రీని వాసయాదవ్‌ను కలసి శుభాకాంక్షలు తెలిపినట్లు నాగేశ్వరరావుయాదవ్ తెలిపారు.

టీడీపీ నాయకుడిపై దాడి

చాగలమర్రి, జూన్ 28: మండలంలోని జ్ఞానాపురం గ్రామానికి చెందిన టీడీపీ బూత్ ఇన్‌చార్జి తలారి ప్రసాద్‌పై కొందరు వ్యక్తులు మూకుమ్మడిగా దాడి చేసి గాయపరిచారని శుక్రవారం ఎస్ఐ రమణయ్య తెలిపారు. ఆస్తి విషయంలో ఆయన దాయాదులైన పది మంది కత్తులు, కర్రలతో దాడి చేశారని చెప్పారు. గాయపడిన ప్రసాద్‌ను చికిత్స నిమిత్తం ప్రొద్దుటూరు వైద్యశాలకు తరలించారు. బాధితుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ చెప్పారు.